ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు
5
శనివారం 8 నవంబరు 2025

పశు బీమాకు నిధులేవీ?



ఎమ్మిగనూరు సంతకు వచ్చిన పశువులు

పశు పోషకులకు భరోసా ఇవ్వాలనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోంది. రైతులకు భీమా ఇవ్వాలనే ఆశయంతో 'పశు బీమా పథకం' అమలుకు శ్రీకారం చుట్టింది. ప్రీమియం చెల్లింపు కోసం జిల్లాకు రూ.11 లక్షలు మంజూరు చేసింది. ఇంత వరకు బాగానే ఉన్నా.. ప్రభుత్వం ఇచ్చిన నిధులు ఖాళీ అవడంతో.. పశువులకు బీమా చేద్దామని వెళ్తున్న రైతులకు నిరాశే మిగులుతోంది. ఈ పథకం అమలు తీరుపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

- ఆగిపోయిన ప్రీమియం చెల్లింపు
- ప్రభుత్వం నిధులిస్తేనే రైతులకు భీమా
- జిల్లాలో ఆవు, గేదె జాతి పశువులు 3.36 లక్షలు
- 18.12 లక్షల గొర్రెలు, మేకలు
- ప్రీమియం చెల్లించినది 14,418 పశువులకే

కర్నూలు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజల ప్రధాన జీవనాధారం వ్యవసాయం. రైతులు ప్రత్యామ్నాయ జీవనాధారంగా పశు పోషణ, పాడి, గొర్రెలు, మేకల పెంపకం చేస్తున్నారు. పలు గ్రామాల్లో పాడి పశువుల పోషణ ద్వారా జీవనం సాగిస్తున్నారు. పశు గణన లెక్కల ప్రకారం జిల్లాలో ఆవు, గేదె జాతి పశువులు 3.36 లక్షలు, గొర్రెలు, మేకలు 18.12 లక్షలకుపైగా ఉన్నాయని పశు సంవర్ధక శాఖ అధికారులు తెలిపారు. పాతికేళ్ల కిందటితో పోలిస్తే పశువుల సంఖ్య గణనీయంగా తగ్గింది. కారణం.. పశ్చిమ ప్రాంత పల్లెసీమల్లో వెంటాడే కరువు, దుర్భిక్ష పరిస్థితులే. వేసవిలో పశుగ్రాసం కొరత కారణంగా మెజార్టీ రైతులు పశువులను సంతలో అమ్మేస్తున్నారు. అయినా.. పలువురు రైతులు పాడి ఆవులు, గేదెలు పోషణ ద్వారా జీవనం సాగిస్తున్నారు. ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆలూరు, ఆదోని, మంత్రాలయం, కోడుమూరు నియోజకవర్గాల్లో గొర్రెలు, మేకలు పెంపకం వృత్తిగా పలువురు జీవనం సాగిస్తున్నారు. పశు పోషకుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకున్న కూటమి ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ నిధులతో రాయితీపై మినీ గోకులాల నిర్మాణం, పశుగ్రాసం, పశు గ్రాసం పెంపకానికి విత్తనాలు పంపిణీ చేస్తున్నది.

పశు బీమా పథకం అమలు

ప్రకృతి వైపరీత్యాలు (తుపాన్లు, వరదలు, పిడుగుపాటు) వల్ల పశువులు చనిపోతే ప్రభుత్వం 'పశు నష్టపరిహారం' కింద ఆర్థిక సాయం చేస్తూ వచ్చింది. ఈ పరిహారం పొందాలంటే రైతులకు ఎన్నో ఇబ్బందులు ఉండేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక 'పశు బీమా పథకం' అమలుకు శ్రీకారం చుట్టింది. ప్రీమియం చెల్లింపు కోసం 2025-26 ఆర్థిక సంవత్సరంలో ప్రతి జిల్లాకు రూ.11 లక్షలు నిధులు మంజూరు చేశారు. ఒకసారి ప్రీమియం చెల్లిస్తే మూడేళ్ల వరకు వర్తిస్తుంది. దారిద్ర్యరేఖకు దిగువన (బీపీఎల్) ఉన్న రైతు కుటుంబాలు, ఎస్సీ, ఎస్టీ రైతులు రూ.30 వేల వరకు విలువైన పశువులకు చెల్లించే ప్రీమియంలో ప్రభుత్వం 85 శాతం, దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్న రైతులకు 50 శాతం రాయితీ ఇస్తారు. రాయితీ అమౌంట్ పోను మిగిలిన మొత్తం రైతులు చెల్లించాల్సి ఉంటుంది. పశువులకు రూ.15 వేలు బీమా కోసం నిర్ణయించిన ప్రీమియం రూ.960 కాగా ప్రభుత్వం వాటా రూ.816, రైతు వాటా రూ.149 చెల్లించాలి. రూ.30 వేలు బీమాకు ప్రీమియం రూ.1,920 కాగా, ప్రభుత్వం వాటా రూ.1,632, రైతు వాటా రూ.298 చెల్లించాలి. గొర్రెలు, మేకలకు రూ.6 వేలకు ప్రీమియం రూ.375లకు గాను ప్రభుత్వ వాటా రూ.320 కాగా రైతులు రూ.55 చెల్లించాలి. పాడి, వ్యవసాయంలో తోడుగా ఉండే కాడెద్దుల పోషణ రైతులు, మూగజీవాల పెంపకందారులకు బీమా కొండంత ధీమా ఇస్తుంది. బీమా చేసిన పశువులు మృత్యువాత పడితే రూ.15-30 వేల వరకు బీమా పరిహారం అందుతుంది. ఒక కుటుంబానికి గరిష్టంగా 10 పశువులు, 50 గొర్రెలు, మేకలకు పశు బీమా వర్తిస్తుంది.

● నిధుల కొరతతో ఆగిన బీమా పథకం:

పశు పోషణ జీవనాధారంగా బతుకుతున్న పలువురు రైతులకు పశు బీమా పథకం ధీమా ఇస్తుందనుకుంటే నిధుల కొరత వెంటాడుతుంది. జిల్లాకు రూ.11 లక్షలు మంజూరు చేశారు. జిల్లాలో 3,36,384 పశు సంపద ఉందని పశు గణాంకాలు చెబుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ.15 వేల బీమా కోసం వంద శాతం పశువులకు ప్రీమియం చెల్లించాలంటే ప్రభుత్వ వాటా కింద రూ.27.45 కోట్లు అవుతుంది. ఒక కుటుంబానికి పది పశువులకే పరిమితం పెట్టడం వల్ల కేవలం 30 శాతం పశువులకు బీమా చేయాలన్నా రూ.4.12 కోట్లు చెల్లించాలి 18.12 లక్షల గొర్రెలు, మేకలు ఉన్నాయి. ఒక్కో కుటుంబం గరిష్టంగా 50 గొర్రెలు, మేకలకే బీమా ప్రీమియం చెల్లించాలి. మొత్తం గొర్రెలు, మేకల్లో పది శాతం వాటికి బీమా చేయాలన్నా ప్రభుత్వం వాటా ప్రీమియం రూ.5.80 కోట్లు అవసరం. అంటే.. జిల్లాలో ఉన్న పశు సంపదలో 15 శాతం, గొర్రెలు, మేకలకు పది శాతం బీమా చేయాలన్నా, ప్రభుత్వ వాటా ప్రీమియం రూ.9.50-10 కోట్లు అవసరం ఉంటుందని అంచనా. అయితే.. ప్రభుత్వం మంజూరు చేసింది కేవలం రూ.11 లక్షలే. దీంతో 14,418 పశువులు, గొర్రెలు, మేకలకు మాత్రమే బీమా చేశారు. ఖాతాలో నిధులు ఖాళీ కావడంతో రెండు నెలలుగా పశు బీమా ప్రీమియం చెల్లింపులు ఆపేశారు. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిధుల కొరత వల్లనో, మరే ఇతర కారణంగానో ఈ పథకంపై రైతుల్లో అవగాహన కల్పించడంలో విఫలమయ్యారనే ఆరోపణలు లేకపోలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఈ పథకంపై రైతుల్లో సంపూర్ణ అవగాహన కలిగించాలి. ప్రతి రైతు పశు బీమా చేసేలా చర్యలు తీసుకోవాలి.



పశు బీమా రైతులకు వరం



పశు బీమా పథకం రైతులకు ప్రభుత్వం ఇచ్చిన వరం. పశు పోషణ రైతులు సద్వినియోగం చేసుకోవాలి. గ్రామాల్లో ఈ పథకంపై రైతుల్లో చైతన్యం, సంపూర్ణ అవగాహన కల్పిస్తున్నాం. పశు చికిత్స శిబిరాలోనే కాకుండా పల్లెసీమల్లో ఏ కార్యక్రమం జరిగినా రైతులకు బీమా గురించి వివరిస్తున్నాం. ప్రభుత్వం మంజూరు చేసిన ప్రీమియం రాయితీ నిధులు రూ.11 కోట్లు అయిపోయాయి. నిధులు రాగానే మళ్లీ బీమా ప్రక్రియ ప్రారంభిస్తాం.

\- డాక్టర్ వి. హేమంత్ కుమార్, ఇన్‌చార్జి జేడీ, పశు సంవర్ధక శాఖ, కర్నూలు

308 పశువులకు బీమా పరిహారం



జిల్లాలో పశు బీమా పథకం కింద నమోదు చేసిన 406 పశువులు వివిధ కారణాలతో మృత్యువాత పడ్డాయి. 375 పశువులకు బీమా పరిహారం మంజూరు కోసం రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. 308 దరఖాస్తులకు అధికారులు ఆమోదం తెలిపారు. వివిధ కారణాలతో 16 తిరస్కరించారు. రెండింటిని వెనక్కి పంపించారు. మరో 13 పశువులకు ప్రతిపాదన దశలో ఉన్నాయి. బీమా పరిహారం నేరుగా రైతుల ఖాతాలో జమ అవుతుంది.

జిల్లాలో పశు సంపద వివరాలు

పశువుల రకం	సంఖ్య
ఆవు జాతి	2,21,934
గేదె జాతి	1,14,451
గొర్రెలు	14,81,145
మేకలు	3,31,764
కోళ్లు	8,04,641
కుక్కలు	11,604
పందులు	11,698
బీమా చేసిన పశువులు	14,418



గొర్రెలకు మేతకు తీసుకెళ్తున్న కాపరులు (ఫైల్)

ఉరుకుంద హుండీ ఆదాయం రూ.1. 37 కోట్లు



హుండీ లెక్కింపులో పాల్గొన్న సిబ్బంది

కౌతాళం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానంలో స్వామి వారికి భక్తులు సమర్పించిన కానుకల హుండీని దేవస్థానం కాలక్షేపపు మండపంలో శుక్రవారం ఆలయ డిప్యూటీ కమిషనర్, ఈ ఓ వాణి ఆధ్వర్యంలో లెక్కించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భక్తులు స్వామి వారికి సమర్పించిన కానుకల్లో నగదు రూ.1,37,79,215, బంగారం 6.74 గ్రాములు, వెండి 18. 990 కిలోలు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో హుండీ పర్యవేక్షణ అధికారి వెంకటేష్, ఆదోని గ్రూపు ఆలయ పర్యవేక్షులు, ఆలయ అధికారులు మల్లికార్జున, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బంగారు రథంపై ప్రహ్లాదరాయలు



బంగారు రథంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు బంగారు రథంపై విహరించారు. శుక్రవారం కార్తీక విదియ శుభదినాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య బంగారు రథంపై ఉత్సవమూర్తి ప్రహ్లాద రాయలను పీఠాధిపతి హారతులిచ్చాక ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. ఉత్సవమూర్తికి ఊంజలసేవ నిర్వహించారు. భక్తులకు పీఠాధిపతి శేష వస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వాదించారు.

ఆర్‌యూ స్నాతకోత్సవానికి ఏర్పాట్లు

- 18,396 మంది దరఖాస్తులు
- 75 గోల్డు మెడల్ పీహెచ్‌డీల ప్రదానం
- ఉప కులపతి వి. వెంకట బసవరావు

కర్నూలు అర్బన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రాయలసీమ విశ్వవిద్యాలయం 4వ స్నాతకోత్సవానికి ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయని ఉపకులపతి వి. వెంకట బసవరావు తెలిపారు. శుక్రవారం వర్సిటీలోని కాన్ఫరెన్సు హాలులో రెక్టార్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ నాయుడు, పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ వి. వెంకటేశ్వరరావులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్నాతకోత్సవానికి 18,396 మంది దరఖాస్తు చేసుకున్నారని, అందులో 75 మందికి గోల్డ్ మెడల్ పీహెచ్‌డీలు ప్రదానం చేయబోతున్నామని తెలిపారు. ఈ స్నాతకోత్సవానికి జస్టిస్ గవర్నర్ అబ్దుల్ నజీర్, మంత్రి నారా లోకేశ్ హాజరవుతారని తెలిపారు. ఏమ్ గ్రీన్స్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్ఎస్ వి. రామకుమర్‌కు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయబోతున్నామని తెలిపారు. స్నాతకోత్సవానికి దరఖాస్తు చేసుకున్న బంగారు పతక విజేతలు, పరిశోధక విద్యార్థులు స్నాతకోత్సవానికి ముందు కంట్రోలర్ ఆఫ్ పరీక్షల విభాగంలో ఎంట్రీ పాసులు పొందాలని సూచించారు. విద్యార్థితో పాటు మరొకరికి మాత్రమే ప్రవేశం ఉంటుందని తెలిపారు. ఉదయం 8 గంటలోపు రిజిస్ట్రేషన్ కౌంటర్లు అందుబాటులో ఉంటాయని, 10 గంటల కంతా స్నాతకోత్సవ హాలులో సిద్ధంగా ఉండాలని సూచించారు. డీన్లు సుందరానందపుచ్చా, భరత్‌కుమార్, సి. విశ్వనాథరెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌యూ ఉపకులపతి

12న గవర్నర్ రాక

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12వ తేదీన గవర్నర్ జస్టిస్ అబ్దుల్‌నజీర్ కర్నూలుకు రానున్నారు. రాయలసీమ యూనివర్సిటీ 4వ కాన్వికేషన్ కార్యక్రమానికి హాజరు కానున్నారు. అనంతరం నగరంలోని మాంటిస్సోరి స్కూల్ గోల్డెన్ జూబ్లీ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు.

అభివృద్ధికి సహకరించండి

కార్పొరేట్ సంస్థల యాజమాన్యాలతో కలెక్టర్ సిరి

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధికి సహకరించాలని కలెక్టర్ డా. సిరి వివిధ కార్పొరేట్ సంస్థలను కోరారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో డిస్ట్రిక్ట్ లెవెల్ సీఎస్ఆర్ రివ్యూ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా పూర్తిగా వర్షాధారమని, ప్రధానంగా జిల్లా పశ్చిమ ప్రాంతం అభివృద్ధికి జిల్లాలో ఉన్న కార్పొరేట్ సంస్థలు ప్రభుత్వ నిబంధనల మేరకు తమ సంస్థల లాభాల నుంచి రెండు శాతం నిధులను కేటాయించాలని కోరారు. ఈ సమావేశానికి సీపీవో భారతి, గ్రీన్ కో సంస్థ నుంచి బాషా, శరత్‌చంద్రరావు, టీజీవీ ఇండస్ట్రీస్ నుంచి రాఘవేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాట్సాప్ గవర్నెన్స్ సేవలు వినియోగించాలి

ప్రతి శుక్రవారం సచివాలయాల ఉద్యోగులు తమ పరిధిలో ఇంటింటికి వెళ్లి అన్ని కుటుంబాలు వాట్సాప్ గవర్నెన్స్ సేవలు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, చర్యలు తీసుకోవాలని జడ్పీ సీఈవో, డివిజనల్ లెవెల్ డెవలప్‌మెంట్ అధికారులు (డీఎల్‌డీవోలు) ఈ అంశంపై పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. పంచాయతీ సెక్రటరీలు, వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు, ఇతర సచివాలయ సిబ్బందితో సమన్వయపరుచుకుని అన్ని కుటుంబాలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సిరి

నిబంధనలు పాటించాలి

ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులు, ల్యాబ్‌లు క్లినిక్‌లు, డయోగ్నస్టిక్ సెంటర్లు బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి జారీ చేసిన నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో కాలుష్య నియంత్రణ చర్యలపై అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఈఈ కిషోర్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ భాస్కర్ పాల్గొన్నారు.

అవినీతి అధికారులపై చర్యలు

కర్నూలు లీగల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలలో అవినీతికి పాల్పడిన అధికారులపై కొరడా ఝుళిపిస్తూ రాష్ట్ర ఉప లోకాయుక్త ఆదేశాలు పి.రజని జారీ చేశారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం గ్రామీణ మండలంలోని బొమ్మూరు, కాతేరు, హుకుంపేట, పిడుంగొయ్యి గ్రామ పంచాయతీలలో నిధుల దుర్వినియోగం, అక్రమ లేఅవుట్లు, అనధికార నిర్మాణాలకు సంబంధించి 2020-2024 సంవత్సరాలలో లోకాయుక్తకు రెండు ఫిర్యాదులు వచ్చాయి. మచిలీపట్నానికి చెందిన జె.శ్రీనివాసగౌడు దాఖలు చేసిన ఫిర్యాదుపై రాష్ట్ర ఉప లోకాయుక్త ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఈ గ్రామాలకు చెందిన అధికారులు పంచాయతీ అధికారి కేపీ చంద్రశేఖర్, పి.సురేష్‌బాబు, బి.రామశ్రీనివాస్, డి.విజయరాజుతో పాటు మరికొందరిపై ఫిర్యాదు దాఖలు చేశారు. ఈ మేరకు రాష్ట్ర లోకాయుక్త ప్రభుత్వానికి నోటీసులు జారీ చేశారు. ఆ తర్వాత లోకాయుక్త పదవీ ఖాళీగా ఉండడంతో ఉప లోకాయుక్త రజని కేసును విచారించారు. సదరు అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు ప్రభుత్వం ఉప లోకాయుక్తకు తెలియజేసింది. ఇతర అధికారులైన రామ ప్రసాద్‌రావు, బెన్హర్ ఎడ్వర్డ్, రామ్మోహన్‌రావు, మహేశ్వరప్రతాప్, శ్రీనివాసరావు, సుభాషిణిపై కూడా చర్యలు తీసుకున్నట్లు ప్రభుత్వం ఉప లోకాయుక్తకు తెలియజేసింది.

ఎంపీపీపై అవిశ్వాస తీర్మానానికి రెడీ

- ఆర్డీవోకు ఫారం-2ను అందించిన ఎంపీటీసీ సభ్యులు
- త్వరలో టీడీపీ ఖాతాల్లోకి రెండు పదవులు

కర్నూలు రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కర్నూలు ఎంపీపీపై అవిశ్వాసం ప్రవేశపెట్టడానికి తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీ సభ్యులు సిద్ధమయ్యారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, వివిధ గ్రామాలకు చెందిన టీడీపీ ఎంపీటీసీ సభ్యులు శుక్రవారం రాత్రి కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్‌ను కలిశారు. ఎంపీపీ పీఠంపై అవిశ్వాసం తీర్మానం పెట్టాలని ఫారం-2ను అంద జేశారు. కర్నూలు మండలంలో మొత్తం 2 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా వారిలో పసుపుల-1, మురళీకృష్ణ జి.శింగవరం ఎంపీటీసీ సభ్యులు సవారన్న మరణించారు. మిగిలిన ఆర్.కొంతలపాడు ఎంపీటీసీ కురువ గిడ్డమ్మ సుంకేసుల సర్పంచ్‌గా గెలవడంతో కొంతలపాడు ఎంపీటీసీ స్థానానికి రాజీనామా చేశారు. పంచలింగాల ఎంపీటీసీ సభ్యు లుగా ఎంపికైన నాగరాజుకు టీడీపీ అధినాయకత్వం కర్నూలు ఎంపీ టికెట్ కేటాయించి ఎన్నికల్లో గెలుపొందారు. ఆయన ఎంపీగా గెలిచిన వెంటనే పంచలింగాల ఎంపీటీసీ స్థానానికి నాగరాజు రాజీనామా చేశారు. 23 ఎంపీటీసీలకు గాను నాలుగు స్థానాలు ఖాళీ ఏర్పడగా మిగిలింది మండలంలో కేవలం 19మంది ఎంపీటీసీ సభ్యులు మాత్రమే. ఉల్చాలకు చెందిన వైసీపీ ఎంపీటీసీ డి.వెంకటేశ్వరమ్మ కర్నూలు ఎంపీపీగా కొనసాగు తున్నారు. వైస్ ఎంపీపీగా పంచలింగాల-2 ఎంపీటీసీ నెహమ్యా ఉన్నారు. వైసీపీకి సభ్యుల సంఖ్యాబలం తక్కువగా ఉన్న నేపథ్యంలో ఏపీ పంచాయతీ రాజ్ 1994 చట్టం ప్రకారం ఎంపీపీ స్థానానికి నాలుగేళ్లు దాటితే వెంటనే తోటి సభ్యులు అవిశ్వాస తీర్మానం పెట్టడానికి చట్టం వెసులుబాటు కల్పించింది. ఈక్రమంలో మొత్తం 19మంది ఎంపీటీసీలకు గాను 13మంది ఎంపీటీసీ సభ్యులు టీడీపీలో ఉన్నారు. రెండు బై మూడోవంతు చొప్పున సభ్యులు టీడీపీ ఉండటంతో ఎంపీటీసీలు మూకుమ్మడిగా ఎంపీపీ స్థానానికి అవిశ్వాస తీర్మానాన్ని ప్రకటించారు. ఈనెల 10వ తేదిలోపు ఆర్డీవో 19మంది ఎంపీటీసీ సభ్యులకు అవిశ్వాసం పెట్టెందుకు నోటీసులను అందజేయనున్నారు. నోటీసు అనంతరం 14రోజులలోపు కర్నూలు ఆర్డీవో అధ్యక్షతన అవిశ్వాస తీర్మానం పెట్టనున్నారు. ఎంపీపీతో పాటు వైస్ ఎంపీపీ పదవి రెండు కూడా టీడీపీ ఖాతాల్లోకి చేరనున్నాయి.



ఫారం-2ను ఆర్డీవోకు అందిస్తున్న ఎంపీ నాగరాజు, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీలు

నిండు కుండలా శ్రీశైలం

- నీటి మట్టం 885 అడుగులు
- సామర్థ్యం 210.03 టీఎంసీలు



శ్రీశైలం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల జలాశయం పూర్తి స్థాయి నీటినిల్వతో నిండుకుండలా మారింది. శుక్రవారం జూరాల ప్రాజెక్టు విద్యుదుత్పత్తి ద్వారా 32,460 క్యూసెక్కులు, సుంకేసుల ద్వారా 4,560 క్యూసెక్కుల నీరు విడుదల కాగా సాయంత్రానికి శ్రీశైల జలాశయానికి 58,426 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లోగా వచ్చి చేరినట్లు అధికారులు తెలిపారు. కుడి, ఎడమ గట్టు గట్టు విద్యుదుత్పత్తి కేంద్రాల ద్వారా 27,000, 35,315 క్యూసెక్కులు మొత్తంగా 62,315 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలైంది. జలాశయంలో నీటిమట్టం 885 అడుగులు ఉంది. నీటిసామర్థ్యం 215 టీఎంసీలకుగాను 210.03 టీఎంసీలుగా నమోదైంది.

ఘనంగా 'వందేమాతరం' గేయాలాపన 6

వలసలు నివారించాలి
- చెరువులను నింపడంలో అధికారుల నిర్లక్ష్యం 7
- జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి
- జడ్పీటీసీల ఆవేదన
- ముగిసిన సర్వసభ్య సమావేశం

క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించాలి

- స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ కృష్ణ ప్రకాష్
- అవగాహన ర్యాలీ చేపట్టిన వైద్యులు


క్యాన్సర్ అవగాహన ర్యాలీలో పాల్గొన్న అధికారులు, వైద్యులు

కర్నూలు హాస్పిటల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించి సమయానికి చికిత్స చేసుకుంటే నివారించవచ్చని కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ ప్రకాష్ అన్నారు. శుక్రవారం జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ వద్ద ర్యాలీని కేఎంసీ ప్రిన్సిపాల్ డా.కే.చిట్టి నరసమ్మ, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే. వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన ప్రారంభించారు. క్యాన్సర్ పట్ల భయపడాల్సిన అవసరం లేదని ప్రజల్లో అవగాహన కల్పిం చడం కోసమే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డా.కృష్ణ ప్రకాష్ తెలిపారు. డా.కే. వెంకటేశ్వర్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కే. చిట్టినరసమ్మ మాట్లాడుతూ క్యాన్సర్‌పై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించాలన్నారు. స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ సీఎస్ఆర్ఎంవో డా.బీ.హేమనళిని, జీజీహెచ్ ఆర్ఎంవో డా.వెం కటరమణ, క్యాన్సర్ హాస్పిటల్ ప్రొఫెసర్ డా.ఉమామహేశ్వరరెడ్డి, ప్రివెంటివ్ అంకాలజి నోడల్ డా.నాగరాజు డా.సాయి మాధురి పాల్గొన్నారు.

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో..

జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన ర్యాలీ డీఎంహెచ్‌వో డా.ఎల్.భాస్కర్ జెండా ఊపి ప్రా రంభించారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ శరీర భాగంలో ఎక్కడైనా గడ్డలు పుట్టుమచ్చల్లో మార్పులు, మానని పుండ్లు, గొంతులో గరగర, నిత్యం పొడి దగ్గు, మల మూత్ర విసర్జనలో అలవాట్లలో మార్పులు, ఆకలి మందగించడం వంటి లక్షణాలు కనిపిస్తే వైద్యున్ని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో అసంక్రమిత వ్యాధుల నివారణ అధికారి డా.మహేశ్వర ప్రసాద్, సంచార చికిత్స కార్యక్రమ నోడల్ ఆఫీసర్ డా.రఘు, జిల్లా మలేరియా అధికారి ఏ.నూకరాజు, డెమో ప్రకాశ్‌రాజ్, డీఎంహెచ్‌వో కార్యాలయ ఏవో కే.అరుణ, డీపీవో విజయరాజు పాల్గొన్నారు.


ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో

ప్రాణాంతకంగా పిచికారీ



- రైతులను బలి తీసుకుంటున్న క్రిమి సంహారక మందులు
- స్ప్రేపై అవగాహన కొరవడి ఆసుపత్రిపాలు

ఖరీఫ్ మొదలైనప్పటి నుంచి వానలే వానలు.. ఈసారి ఖరీఫ్‌లో మే నెలాఖరులోనే వర్షాలు పడటంతో పత్తి, వేరుశనగ, మొక్కజొన్న తదితర ప్రధాన పంటలను రైతులు సాగు చేశారు. అయితే ఆగస్టు నుంచి ఎడతెరిపి లేకుండా వానలు కురుస్తూనే ఉన్నాయి. వారం రోజుల క్రితం మొంథా తుఫాన్‌తో పంటలన్నీ తుడిచిపెట్టుకుపోయాయి. ప్రస్తుతం పొలాల్లో ఇంకా వర్షం నీరు మడుగులా నిలిచి ఉన్నాయి. దీంతో తెగుళ్లు, క్రిమికీటకాలు విజృంభించాయి. పంటను కాపాడుకోడానికి రైతులు వేలాది రూపాయలు ఖర్చు చేసి క్రిమి సంహారక మందులను వినియోగిస్తున్నారు. జిల్లాలో పురుగు మందుల వాడకం ఎక్కువగా జరుగుతోందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పత్తి, వరి, మొక్కజొన్న, కూరగాయల పంటల్లో వ్యాపిస్తున్న పురుగులు, తెగుళ్లను నివారించేందుకు రైతులు రెండు, మూడు మందులు, గుళికలను పంటలపై స్ప్రే చేస్తున్నారు. ఈ సందర్భంలో రైతుల నోట్లోకి, కళ్లలోకి ఈ మందులు వెళ్లి ప్రాణాపాయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

-కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి)

ప్రమాదకరమైన మందులు

పంటలకు వినియోగించే పురుగు మందుల్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ 5 రకాలుగా విభజించింది. మోథియాన్, మోనోక్రోటోపాస్, ఫోరేట్(గుళికలు) ఫాస్మామిడాన్, మోథోమిల్, కార్బొఫ్యూరాన్, డైక్లోరోవాష్, ఎసిపేట్, పెన్‌వాలరేట్, ఎమిడాక్లోపిడ్, బైపెత్రిన్, కార్బరిల్, కార్బోసల్ఫాన్, క్లోరోఫైరిపాస్, సైపర్ మెత్రిన్, ఏథియాన్, డైకోఫాల్, ప్రొఫెనోపాస్, క్వినాల్‌పాస్ తదితర మందుల్ని గుర్తించారు. పత్తిలో పురుగు నివారణకు పెన్‌వాలరేట్‌ను వినియోగిస్తున్నారు. కాయలో పలకుచేరుకునే పురుగును నివారించేందుకు రెండు మూడు మందులతో కలిపి దీన్ని వినియోగిస్తున్నారు. ఈ మిశ్రమం ఎక్కువ ప్రమాదకరం.



చైనా యంత్రాలు ప్రమాదమే:

దశాబ్దం కిందట పురుగును నివారించేందుకు చేతితో తిప్పే స్ప్రేయర్లతో పొడి మందులు పైరుపైన చల్లేవారు. తర్వాత వీపుకు డబ్బాలు తగిలించుకొని చేతితో ఉపయోగించే పంపు స్ప్రేయర్లు వాడకంలోకి వచ్చాయి. చైనా ఉత్పత్తి చేసిన స్ప్రేయర్లు తక్కువ దరకు దొరుకుతున్నాయి. కానీ అవి తక్కువ దూరానికి మందు వెదజల్లుతాయి. దీని వల్ల రైతుల శరీరభాగాలకు మందు సులువుగా వ్యాపిస్తుంది. తద్వారా రైతులు ప్రమాదాల బారిన పడుతున్నారు. యంత్రాల ప్రమాణాల ప్రకారం చదరపు అంగుళానికి 350 బిందువుల దాకా పైరుపై పడాలి. చైనా స్ప్రేయర్లు 10 అడుగులు మాత్రమే మందును చల్లగలవు. గాలి వ్యతిరేకంగా వీచినప్పుడు మందు నీళ్లు రైతు శరీరం మీద పడటం వల్ల ప్రమాదమని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

మందు శరీరంలోకి వ్యాపించకుండా జాగ్రత్తలు

- మందు స్ప్రే చేసే సమయంలో చేతులకు తొడుగులు వేసుకోవాలి.
- మూతికి మాస్క్ తగిలించుకోవాలి.
- గాలి వల్ల మందు మీదకు రాకుండా జాగ్రత్త తీసుకోవాలి.
- ప్లాస్టిక్ తరహా చొక్కా వాడాలి.
- పిచికారి తర్వాత పూర్తిగా శుభ్రం చేసుకొని అన్నం తినాలి.



సేంద్రియ విధానం ఆరోగ్యానికి శ్రేయస్కరం

- ప్రస్తుతం పత్తిలో గులాబి పురుగు నివారణకు సేంద్రియ పద్ధతిలో లింగాకర్షక బుట్టలు వినియోగిస్తున్నారు.
- వేపగింజల కషాయంతో పాటు వైరస్ ద్రావణం బెల్లంతో కలిపి పిచికారి చేయాలి. ట్రైకోగామా మిత్ర పురుగులను వదిలితే ప్రాణహాని ఉండదు.
- సేంద్రియ సాగువల్ల పెట్టుబడి తగ్గుతుంది.
- ఈ దిశగా ప్రస్తుతం 45 క్లస్టర్లలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.

మిశ్రమ మందులు విష పూరితం

పురుగుమందు ఏదైనా సరే విషపూరితమేనని రైతులు గుర్తించాలి. పురుగు త్వరగా చనిపోతుందని రైతులు ఆతృతతో ఎక్కువ మందుల్ని మిశ్రమం చేసి వినియోగిస్తున్నారు. ఇది విష పదార్థంగా తయారై రైతు శ్వాసక్రియను దెబ్బతీస్తుంది.

- రాజశేఖర్, ఆగ్రానమి ఏడీఏ

నిర్లక్ష్యంతో ప్రాణాలకు హాని



రైతులు పంట తెగుళ్ల నివారణకు విషపూరితమైన మందులను వినియోగిస్తున్నారు. ఆ సమయంలో అవి శరీరానికి అంటకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం లేదు. క్రిమిసంహారక మందులను ఎలా వినియోగించాలో మండల వ్యవసాయాధికారులు, గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల సిబ్బంది ఎప్పటికప్పుడు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రాణాలకు హానీ.

-వరలక్ష్మి, జేడీ



దిగుబడి లేదు.. ధర లేదు


చింతలచెర్వులో ఉల్లిపంటను దున్నేస్తున్న రైతు

- ఉల్లి రైతు కంట కన్నీరు
- సాగు ఖర్చులు కూడా రాని వైనం
- పంట పొలాలను దున్నేస్తున్న రైతు
- క్వింటం ధర కేవలం రూ.500
- ఆదుకోవాలంటున్న రైతులు

చాగలమర్రి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉల్లి పంట చేతికొచ్చే సమయానికి ధరలు పతనమయ్యాయి. ఈ ఏడాదైన ఉల్లి పంట సాగు చేసి అప్పులు తీర్చుకుందామని అనుకున్న రైతులు అధిక వర్షాలతో, ధరల పతనంతో అప్పుల ఊబిలో కూరుకపోతున్నారు. వరుస తుఫాన్‌లతో చేతికొచ్చిన పంట కుళ్లిపోయి దెబ్బతినింది. ఈ ఏడాది పెద్ద బళ్లారి ఉల్లి అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. పంట కోత సమయంలో ధర పతనమైందని, పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు కన్నీరు పెడుతున్నారు. ఎకరాకు రూ.40 వేలు నుంచి రూ.60 వేల వరకు పెట్టుబడి పెట్టారు. మూడు నెలల పాటు పంటను కాపాడుకుంటూ వచ్చారు. కోత సమయంలో మొంథా తుఫాన్ ముంచేసింది. మండలంలోని చింతలచెరువు, కొలుములపేట, పెద్దవంగలి, చిన్నవంగలి, మూడురాళ్లపల్లె, ఆవులపల్లె, కొత్తపల్లె గ్రామాల్లో 800 ఎకరాల్లో ఉల్లిపంటను సాగు చేశారు. చింతలచెరువు, కొలుములపేట గ్రామాల్లోనే 300 ఎకరాలు పైగా ఉల్లి పంట సాగు చేశారు. ఎకరాకు 40 క్వింటాళ్ల నుంచి 60 క్వింటాళ్ల దాకా దిగుబడి రావాల్సి ఉండగా 10 క్వింటాళ్లు కూడా వచ్చేలా కనిపించడం లేదు. చిన్నవంగలి గ్రామంలో కొందరు రైతులు ఉల్లిపంటను కోత కోసి పంట పొలాల్లోనే వదిలేశారు. ఈ గ్రామాల్లో కొందరు ప్రజలు ఉల్లిగడ్డలను సంచులతో నింపుకొని ఇళ్లకు తీసుకెళ్లారు. చింతలచెరువు, కొలుములపేటలో కొందరు రైతులు ఉల్లిపంటను దున్నేశారు. మరి కొందరు గొర్రెలకు మేతగా వదిలేశారు. క్వింటం రూ.500 కూడా పలకకపోవడంతో రైతులు ఉల్లిగడ్డలను కోసేందుకు కూలీ ఖర్చులు కూడా రావని తలంచి పొలాల్లోనే వదిలేశారు. ప్రభుత్వం స్పందించి పరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.


కొలుములపేటలో ధర లేక పొలంలోనే ఆరబెట్టిన ఉల్లిగడ్డలు

వర్షాల వల్ల నష్టపోయాం:



మూడెకరాల్లో ఉల్లి పంట సాగు చేశా. కోత సమయంలో తుఫాన్‌లు దెబ్బతీశాయి. కూలీ ఖర్చులు కూడా వచ్చేలా లేదు. దీంతో పంటను దున్నేసి, ప్రత్యామ్నాయ పంట సాగుకు ప్రయత్నిస్తున్నా. ప్రభుత్వం ఆదుకోవాలి.

-మద్దిలేటి, రైతు, చింతలచెరువు

నష్టపోయాం.. ఆదుకోండి



4 ఎకరాల్లో ఉల్లి పంట సాగు చేశా. రూ.2 లక్షలు పెట్టుబడి పెట్టా. పంట కోత సమయంలో మొంథా తుఫాన్ ముంచేసింది. కోసిన ఉల్లిగడ్డలు తడిసి దెబ్బతిన్నాయి. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చేలా లేదు. ప్రభుత్వం ఆర్థిక సాయం చేయాలి.

-సహదేవరెడ్డి, రైతు, కొలుములపేట

అత్యధికులు మాట్లాడే భాష తెలుగు

- పొట్టి శ్రీరాములు త్యాగనిరతిని విస్మరించకూడదు
- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్
- కన్నుల పండువలా ముగిసిన కర్నూలు ఉత్సవ్-2025


ప్రథమ బహుమతి పొందిన కళాకారులను సత్కరిస్తున్న టీజీ

కర్నూలు కల్చరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): దేశంలో అత్యధికులు తెలుగు భాష మాట్లాడతారని, దేశంలోనే మొట్టమొదటి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. శుకవారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో గత వారం రోజులుగా కొనసాగిన 'కర్నూలు ఉత్సవ్-2025' కన్నుల పండువలా ముగిసింది. ఈ ముగింపు వేడుకలు, బహుమతి ప్రదానం, కళారం గంలో విశిష్ట సేవకులకు సత్కారం కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా టీజీ వెంకటేశ్ హాజరయ్యారు. తొలుత తెలుగు తల్లి, పొట్టి శ్రీరాములు చిత్ర పటాలకు పూలదండలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ రోజున ప్రారంభించిన వారం రోజుల కార్యక్రమాలు నిత్యకల్యాణం పచ్చతోరణంలా టీజీవీ కళాక్షేత్రంలో అలరించాయని అన్నారు. ఈ కార్యక్రమాల రూపకల్పనలో ప్రత్యక్షంగా, పరోక్షంగా కృషి చేసిన వారిని, సహకారాలు అందించిన వారిని ఆయన పేరుపేరునా ప్రశంసించారు. ఎవరి భాష వారికి కన్నతల్లి వంటిదని, తెలుగు మాట్లాడేవారు దేశంలోనే అత్యధికులని అన్నారు. రాష్ట్రాన్ని సాధించిన పొట్టి శ్రీరాములును ఎవరూ మర్చిపోకూడదని గుర్తుచేశారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు కళారత్న పత్తి ఓబులయ్య మాట్లాడుతూ కర్నూలు ఉత్సవ్ ఏడు రోజులు వైభవంగా నిర్వహించడంలో టీజీ వెంకటేశ్ సహకారం ఎంతో ఉందని అన్నారు. పారిశ్రామికవేత్త బీవీ రెడ్డి, విద్యావేత్తలు జి.పుల్లయ్య, కేవీఎస్ రాజశేఖర్ ఎంతో సహకరించారని అన్నారు. ఈ కార్యక్రమంలో రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి. పుల్లయ్య, పారిశ్రామికవేత్త బీవీ రెడ్డి, కాపునాడు అధ్యక్షుడు ఆర్జా రామకృష్ణ, కళాక్షేత్రం ఇతర ప్రతినిధులు కేవీ రెడ్డి, దాశెట్టి శ్రీనివాసులు, కె. రామస్వామి, పీపీ గురుమూర్తి, పి. రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.

ఏకాంకిక నాటక పోటీల్లో విజేతలు వీరే...

గత వారం రోజులుగా కొనసాగిన ఏకాంకిక పౌరాణిక పద్య నాటక పోటీల్లో విజేతలను న్యాయ నిర్ణేతలు ప్రకటించారు. ఉత్తమ ప్రదర్శన రూ.15 వేలు నగదు బహుమతిని భక్త చింతామణి (పురాణం ఘట్టం) గెల్చుకుంది. బిల్వ మంగళుడుగా ఆర్‌సీ లక్ష్మణరాజు (ఉల్చాల), రాధగా తిరుమలాబాయి (తెనాలి), దామోదరునిగా శేషయ్య (నంద్యాల) నటించారు. ద్వితీయ ప్రదర్శన రూ.12 వేలు నగదు బహుమతిని గయోపాఖ్యానం (యుద్ధసీను) గెల్చుకుంది. శ్రీకృష్ణుడిగా బి. బజారి నాయుడు(పెనుమాడ), అర్జునుడిగా జె. మంజునాథ్ (ఎమ్మిగనూరు) నటించారు. తృతీయ ప్రదర్శనగా 10వేలు నగదు బహుమతిని శ్రీకృష్ణ తులాభారం (ప్రణయ ఘట్టం) గెల్చుకుంది. శ్రీకృష్ణుడిగా ఎం. మురళీ శ్రీనివాస్ (సి. బెళగల్), సత్యభామగా ఎం. రేణుక (బి.తాండ్రపాడు) గెల్చుకున్నారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా సీనియర్ రంగస్థల నటులు ఎన్ జానకిరామ్, పి. రాజారత్నం వ్యవహరించారు. ఈ కళాకారులకు టీజీ వెంకటేశ్ బహుమతులు అందజేశారు.


బహుమతులు పొందిన కళాకారులకు సత్కారం

రాఘవేంద్రస్వామి మఠానికి రూ.3.25 లక్షలు విరాళం

మంత్రాలయం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి బెంగుళూరుకు చెందిన సుస్మిత అనే భక్తురాలు రూ.1.25లక్షలు, హైదరాబాద్‌కు చెందిన రాఘవేంద్ర సందీప్ అనే భక్తుడు రూ.2లక్షలు విరాళం ఇచ్చినట్లు మఠం ఏఏవో మాధవ శెట్టి, మేనేజరు ఎస్కే శ్రీనివాసరావు తెలిపారు. శక్రవారం వేర్వేరు సమయాల్లో కుటుంబ సమేతంగా రాఘవేంద్రస్వామిని దర్శించుకున్నారు. రూ.3.25 లక్షలు విరాళం ఇచ్చిన దాతల కుటుంబాలకు పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు రాఘవేంద్రస్వామి జ్ఞాపిక, శేషవస్త్రం, ఫల, పుష్ప, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో అనంత పురాణిక్, నరసింహా దేశాయ్, శ్రీపాదాచార్ పాల్గొన్నారు.

ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

ఎస్టీయూ

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టాన్ని సవరించి ఇన్‌సర్వీసు ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహా యింపు ఇవ్వాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సలాంఖాన్ ఎస్టీయూ భవన్‌లో ముఖ్య నాయకుల సమావేశం ఇస్మాయిల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2010 కన్నా ముందు నియమితులైన ఇన్‌సర్వీసు ఉపాధ్యాయులు కూడా టెట్ ఉత్తీర్ణత కావాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఉపాధ్యాయులందరూ తీవ్ర ఆందోళనలో ఉన్నారని, ప్రభుత్వం వెంటనే రివ్యూచేయాలని కోరారు. ఈ సమావేశంలో ప్రభాకర్, సుబ్బరాయుడు, నాగన్న, రహీం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఘనంగా 'వందేమాతరం' గేయాలాపన



కర్నూలులో వందేమాతరం గేయాన్ని ఆలపిస్తున్న కలెక్టర్, అధికారులు

కర్నూలు క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వందేమాతరం గేయం 150 ఏళ్ల సందర్భంగా కర్నూలులో కొండారెడ్డి బురుజు వద్ద వందేమాతర గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి మాట్లాడుతూ వందేమాతర గీతం ఒక జాతిని మేల్కొలిపిన శక్తి అని తెలిపారు. వందేమాతరం స్వాతంత్ర్య ఉద్యమకారులకు మనోబలాన్ని ఇచ్చి సామాన్యులను సమరయోధులుగా మార్చిందని, ఈ గీతం భారతమాత స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని, భారత ప్రజల ఐక్యతను వైవిధ్యాన్ని జరుపుకుంటుందని తెలిపారు. జేసీ నూరుల్ కమర్, సెట్కూరు సీఈవో డా.వేణుగోపాల్, డీఈవో శామ్యూల్ పాల్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనూరాధ, ఆర్ఐ ఓ.లాలెప్ప, మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, కార్యాలయ సిబ్బంది, ఎన్‌సీసీ కేడెట్లు, స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో..

భారత స్వాతంత్ర సమరానికి ప్రేరణనిచ్చిన వందేమాతరం జాతీయ గేయం 150వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న సందర్భంగా శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని పరేడ్ మైదానంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, సిబ్బంది వందేమాతరం జాతీయ గేయాన్ని ఆలపించారు. అడిషినల్ ఎస్పీ అడ్మిన్ హుసేన్‌పీరా, ఏఆర్ అడిషినల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీ బాబు ప్రసాద్, హోంగార్డు డీఎస్పీ ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.


జిల్లా పోలీసు కార్యాలయంలో..


పాల్గొన్న ఎన్‌సీసీ కేడెట్లు

వలసలు నివారించాలి

- చెరువులను నింపడంలో అధికారుల నిర్లక్ష్యం
- జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి
- రైతులను ఆదుకొని, మొక్కజొన్న కేంద్రాలు ఏర్పాటు చేయాలి
- జడ్పీటీసీల ఆవేదన
- ముగిసిన సర్వసభ్య సమావేశం


మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, పాల్గొన్న అధికారులు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వలసలు నివారించేందుకు అధికారులు సత్వరమే చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ భవనంలో జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన వ్యవసాయం- అనుబంధ శాఖలు, నీటి యాజమాన్య సంస్థ, మత్స్య శాఖ, దేవదాయ శాఖ తదితర అంశాలపై జిల్లా పరిషత్ సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కర్నూలు, నంద్యాల జిల్లాల కలెకర్లు డా. ఏ. సిరి, జి. రాజకుమారి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అజెండాలోని అంశాలపై జడ్పీటీసీలు ప్రశ్నల వర్షం కురిపించగా వాటికి అధికారులు సమాధానాలు చెప్పారు. చైర్మన్ మాట్లాడుతూ ఉపాధి పనులు కల్పించి వలసలు నివారించడానికి అధికారులు గ్రామ స్థాయిలో పర్యవేక్షించాలన్నారు. అవుకు రిజర్వాయర్ ఎందుకు నింపలేదని అధకారులను జడ్పీటీసీలు ప్రశ్నించారు.



రైతుల ఖాతాల్లో రూ.10 కోట్లు జమ

మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన ఉల్లి పంటకు రూ.10 కోట్లు ఇప్పటికే రైతుల ఖాతాల్లో జమ అయ్యాయని, మిగిలిన రూ.8 కోట్ల మొత్తాన్ని త్వరలోనే రైతుల ఖాతాల్లో జమ చేస్తామని కర్నూలు కలెక్టర్ డా.ఏ .సిరి అన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా మంగళ, బుధ వారాలలో పొలం పిలుస్తోంది అనే కార్యక్రమాన్ని నిర్వహించి వ్యవసాయరంగంలో సాంకేతిక పరిజ్ఞానం, ప్రకృతి వ్యవసాయం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. .కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా పత్తిలో తేమ శాతం 13,14 శాతం ఉన్నా కూడా కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. ఉపాధి హామీ పనులతో జిల్లాలో వలసలు నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తుంగభద్ర హోస్పేట్ డ్యాంలో ఉన్న 30 గేట్‌లు మరమ్మతులు చేస్తున్నందున ఖరీఫ్, తాగునీటికి తప్ప, రబీకి నీరు ఇవ్వరని బోర్డు అధికారులు తెలిపిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు త్వరలో ఏర్పాటు..



మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం త్వరలోనే చర్యలు తీసుకుంటుందని నంద్యాల కలెక్టర్ రాజకుమారి అన్నారు. ఎన్‌హెచ్-340 జాతీయ రహదారి నిర్మాణం కారణంగా బ్రాహ్మణకొట్కూరు- దిగువపాడు ప్రాంత రైతులకు దాదాపు 2500 ఎకరాల పొలాలకు రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని సభ్యులు అడిగిన ప్రశ్నకు తగిన పరిష్కార చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. మిడ్తూరు మండలం జలకనూరు, మద్దిలేరు వాగు మరమ్మతుల కోసం రూ.44 లక్షలు మంజూరు చేశామని, మొంథా తుఫాను ప్రభావంతో జిల్లాలో 11,448 హెక్టార్ల పంట దెబ్బతినిందని, నష్టపరిహారం నిమిత్తం సంపూర్ణ నివేదకను ప్రభుత్వానికి పంపించామని అన్నారు.

బ్రాహ్మణకొట్కూరులో పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన వైన్ షాప్‌ను తొలగించాలని గత ఎన్నో సమావేశాలలో అడిగిన అధికారులు స్పందించడం లేదని, తక్షణమే వైన్ షాప్‌ను తొలగించాలని నందికొట్కూరు జడ్పీటీసీ కరీమున్నిసా కోరారు.

- శనగలు సబ్సిడీ కింద ప్రభుత్వ ధర కంటే బయటకే తక్కువగా కొనుగోలు చేస్తున్నారని, సబ్సిడీ కింద రైతులు ప్రభుత్వం నుంచి రూ. 5800 కొనుగోలు చేస్తుంటే బయట రూ.5600కే దొరుకుతున్నాయని ఓర్వకల్లు జడ్పీటీసీ రంగనాథగౌడు అన్నారు. నష్టపోయిన ఉల్లి రైతులకు హెక్టారుకు రై.50 వేలు చెల్లిస్తామని, ఇప్పటి దాకా ఇవ్వలేదని అన్నారు.
- మొక్కజొన్న కేంద్రాలు ఏర్పాటు చేయాలని, కొత్తపల్లి మండలం దుద్యాల గ్రామంలో మొక్కజొన్న మొత్తం వర్షానికి నాశనం అయిపోయిందని, నష్టపరిహారం చెల్లించాలని జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి కోరారు.
- మిడ్తూరు మండల పరిధిలోని జలకనూరు చెరువుకు మరమ్మతు చేపట్టాలని జడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి కోరారు.
- ఉల్లి పంట వరదలో మునిగిపోయిందని, ఉల్లి రైతులను ఆదుకోవాలని సి.బెళగల్ ఎంపీపీ బొంతల మునెప్ప కోరారు.
- చెరువులో తీస్తున్న మట్టిని అక్కడే వేయకుండా చెరువు గట్టుపై వేసేలా చర్యలు తీసుకోవాలని ఆత్మకూరు జడ్పీటీసీ కోరారు.
- పత్తి కొనుగోలు చేయడం లేదని...కూటమి ప్రభుత్వ వచ్చాక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వెల్దుర్తి జడ్పీటీసీ సుంకన్న అన్నారు.

ఈ సమావేశంలో సీఈఓ జి. నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బారెడ్డి, ఉమ్మడి జిల్లాల అధికారులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొన్నారు.

ఐదు అంశాలకు ఆమోదం..

- జిల్లాలో 138 పనులకు రూ.5.91 కోట్లు మంజూరు.
- జిల్లా పరిషత్ పరిపాలన భవనంలో రూ.25 లక్షలతో లిఫ్ట ఏర్పాటు
- సున్నిపెంటలో పని చేస్తున్న కార్మికులకు జడ్పీ నిధుల నుంచి జీతాల చెల్లింపు
- స్త్రీ శిశు సంక్షేమ శాఖకు మంజూరు చేసిన రూ.3.52 కోట్ల పనుల రద్దు
- 59 సీపీసీడబ్ల్యూ స్కీం నిర్వహణకు టెండరుకు ఎవ్వరూ ముందుకు రావపోవడంతో పాతవారితోనే కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నారు.



కౌలు రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పంటలు బాగా దెబ్బతిన్నాయని, పరిహారం చెల్లించాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి అన్నారు. పంట వేసుకునేది కౌలు రైతులు కాబట్టి, నష్ట పరిహారం కౌలు రైతులకు ఇప్పించాలన్నారు. పత్తి కొనుగోలు చేయాలని, రైతులకు వ్యవసాయ పనిముట్లు అందజేయాలని అన్నారు. నంద్యాల చెక్‌పోస్టు వద్ద రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

కేజీ శనగలు కూడా దొరకడం లేదు

ఆదోని మండలంలో కేజీ శనగ కూడా దొరకడం లేదని కురువ కార్పొరేషన్ చైర్మన్ ఎం.దేవేంద్రప్ప అన్నారు. పెద్ద హరివాణంలో 14 వేల ఎకరాల్లో శనగ పంట వేస్తారని, అధికారులు శనగ విత్తనాలు ఎందుకు పంపిణీ చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. పత్తి కొనుగోలు లేకపోవడంతో రైతుల తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద వంకలు, వాగుల్లో పూడికతీత పనులు చేపట్టాలన్నారు. ఆదోని మండలంలో మార్కెట్ యార్డు నిధులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల సమన్వయంతో రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలన్నారు.





హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు

కర్నూలు క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో హత్యాయత్నం కేసులో నిందితుడు నూరుల్లాను అరెస్టు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.


నిందితుడితో ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి

వివరాలు.. ఈనెల 5వ తేదీన ఫయాజ్‌బాషా అనే వ్యక్తిపై నూరుల్లా దాడి చేసి గాయపరిచాడు. ఫయాజ్‌ను కాపాడడానికి వచ్చిన అతని మిత్రుడు చిన్న హుసేన్‌పై కూడా దాడి చేశాడు. వీరిద్దరి మధ్య ఆర్థిక సమస్యలే దాడికి కారణమని పోలీసులు నిర్ధారించారు. బాధితుల పిర్యాదు మేరకు నిందితుడిని అరెస్టుచేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆరుగురికి జైలు


నిందితులతో పోలీసు అధికారులు

ఆళ్లగడ్డ/సంజామల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో ఆరుగురికి రెండేళ్ల జైలు శిక్ష తో పాటు రూ.5వేలు జరిమానా విధిస్తూ ఆళ్లగడ్డ కోర్టు న్యాయాధికారి శైలజ తీర్పు చెప్పారు. వివరాలు.. సంజామల మండలం రెడ్డిపల్లె గ్రామానికి చెందిన మాయలూరి సూర్యనారాయణరెడ్డి, చిన్నపరెడ్డి హనుమంతరెడ్డి, షేక్ కరీం బాష, ఓబయ్య, వెంకట్ రెడ్డి, ఇమాములు, పూల ఫకుర్‌బాష, దూదేకుల దస్తగిరి ఓకేసులో సాక్షులుగా ఉన్న నెమలి లక్ష్మీనారాయణరెడ్డి, అన్న నెమలి లక్ష్మిరెడ్డిపై దాడి చేశారు. అప్పటి కోవెలకుంట్ల సీఐ కేశవరెడ్డి నిందితులను అదుపులోకి తీసుకొని ఫిబ్రవరి 7, 2016లో కేసు నమోదు చేశారు. నిందితులపై నేరం రుజువైంది. రెండేళ్ల జైలు, రూ.5వేలు జరిమానా విధించారు. కేసు విచారణలో ఉండగానే హనుమంతరెడ్డి, షేక్ కరీంబాషా మరణించారు. పీపీ శివప్రసాద్‌రావు, సంజామల ఎస్ఐ రమణయ్య, పోలీసు సిబ్బంది సహకరించారు.

అంత్యక్రియలకు వెళ్లి వస్తూ..

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


గిరీష్‌బాబు(ఫైల్)

బేతంచెర్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అంత్యక్రియలకు వెళ్లి వస్తూ బైక్‌ను కారు ఢీకొన్న రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన శుక్రవారం పట్టణ శివారులో కొలుమలపల్లె రస్తా జాతీయ రహదారిలో చోటుచేసుకున్నట్లు ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు. వివరాలు.. గోరుమానుకొండ గ్రామానికి చెందిన జంగం గిరీష్‌బాబు(36) కర్నూలు రహదారిలోని కనుమ ఆంజనేయస్వామి పూజారిగా పనిచేస్తున్నారు. కొలుములపల్లె గ్రామంలో తన సమీప బంధువుల మృతి చెందడంతో గిరీష్‌బాబు అంత్యక్రియలు ముగించుకుని తిరిగి బేతంచెర్లకు వస్తున్నాడు. జాతీయ రహదారిని మోటారు సైకిల్ క్రాస్ చేసే సమయంలో డోన్ నుంచి కర్నూలు వైపు వెళ్లే కారు ఢీకొట్టింది. తీవ్రగాయాలకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య రాణి, కొడుకు, కూతురు ఉన్నారు. మృతుడి భార్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కర్నూలు క్రైం, నవంబరు (ఆంధ్రజ్యోతి): నగరంలోని బళ్లారి చౌరస్తా సమీపంలో డీమార్ట్ ఎదురుగా ఉన్న ఫ్లైఓవర్‌పై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలైనట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. వివరాలు.. బాలాజీనగర్‌కు చెందిన సాదిక్, సాజిదా అక్కాతమ్ముళ్లు. వీరిద్దరు కేవీ సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్నారు. సాయంత్రం బైక్‌పై ఇంటికి వెళ్తుండగా ఫ్లైఓవర్‌పైన ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టారు. వీరిద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు స్పందించి బంధువులకు సమాచారమివ్వడంతో వారిని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీపేటకు చెందిన కృపాల్‌సాగర్ (38) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాలివీ.. పట్టణంలోని ఎస్ ఆర్ ల్యాబ్ టెక్నీషియన్ నడుపుకుంటూ జీవనం సాగించే కృపాల్‌సాగర్ ఈ రోజు సాయంత్రం తన ల్యాబ్‌లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని అత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. కృపాల్‌సాగర్‌కు రెండు నెలల క్రితం కృపాల్ సాగర్ మూగతికి చెందిన యువతితో వివాహం జరిగింది. అత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

నేర పరిశోధనలో టెక్నాలజీని వాడండి

- పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేయాలి
- ఎస్పీ సునీల్ షెరాన్



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ సునీల్ షెరాన్

నంద్యాల టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): నేర పరిశోధనలో ఆధునిక టెక్నాలజీని వాడాలని నంద్యాల ఎస్పీ సునీల్ షెరాన్ అన్నారు. శుక్రవారం స్థానిక పోలీసు కార్యాలయంలో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడు తూ పెండింగ్ కేసులను త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. పోక్సో కేసులో చార్జ్‌షీటు త్వరగా దాఖలు చేసి నిందితులకు శిక్ష పడేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎఫ్ఎల్ఎస్(ఫోరెన్సిక్ ల్యాబ్ అండ్ సైన్స్) రిపోర్టు వచ్చిన కేసుల్లో చార్జ్‌షీటు వేసిన తరువాత కోర్టులో తిరస్కరణకు గురికాకుండా చూడాలన్నారు. ప్రస్తుతం నమోదైన కేసుల వివరాలు అడిగి తెసుకున్నారు. మిస్సింగ్ కేసులు, అనుమానాస్పద మరణాలు దర్యాప్తు చేసి వెంటనే కేసులను పూర్తి చేయాలన్నారు. సైబర్‌క్రైం, మర్డర్, యూఐ(అండర్ ఇన్‌వెస్టిగేషన్) పీటీ కేసుల్లో పురోగతి సాధించాలన్నారు. రహదారి ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏఎస్పీ మందా జావళి, ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్‌కుమార్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొట్టిన కారు

వెల్దుర్తి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ముందు వెళుతున్న వాహనాన్ని కారు ఢీకొన్న ఘటన వెల్దుర్తిలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఒకరి పరిస్థితి విషమం కాగా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి.


నుజ్జునుజ్జయిన కారు

- ఒకరి పరిస్థితి విషమం

వివరాలు.. కర్నూలుకు చెందిన కార్తీక్, హరి, కార్తీక్ కలిసి డోన్‌లో వివాహ వేడుకలకు కారులో బయలుదేరారు. వెల్దుర్తిలోని హైవేపై హనుమాన్ జంక్షన్ వద్ద తెలంగాణ రాష్ట్రం అలంపూర్ నుంచి బెంగళూరుకు ఎండుమిర్చి లోడుతో ముందు వెళుతున్న వాహనాన్ని వెనుకవైపు నుంచి ఢీకొట్టారు. కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. వాహనం వెనుక భాగం దెబ్బతింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ హరి తలకు బలమైన గాయమైంది. కారులో ఉన్న మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. అదే సమయంలో ప్యాపిలి హైవే అంబులెన్స్ కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో రోగిని జాయిన్ చేయించి తిరిగి ప్యాపిలికి వెళుతోంది. ప్రమాదం జరిగిన వెంటనే ప్యాపిలి అంబులెన్స్ పైలట్ ప్రసాద్, ఈఎంటీ అర్జున్ క్షతగాత్రులను కర్నూలు సర్వజన వైద్యశాలకు తరలించారు. హైవే పెట్రోలింగ్ పోలీసు చంద్రశేఖర్ ఘటనాస్థలికి చేరుకొని క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో కర్నూలుకు తరలించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. కారు డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు.

నేడు, రేపు యురాలజీ వైద్యుల సదస్సు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వైద్యులు

నంద్యాల హాస్పిటల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నంద్యాల, కర్నూలు యురాలజీ వైద్యుల సంఘం సంయుక్త నిర్వహణలో రెండు తెలుగు రాష్ట్రాల 37వ వార్షిక యురాలజీ వైద్యుల వైజ్ఞానిక సదస్సు ఈ నెల 8, 9తేదీల్లో నంద్యాలలోని సౌజన్య కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కార్యదర్శి డా.భార్గవ వర్ధన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డా. రవికృష్ణతో కలిసి స్థానిక ఐఎంఏ కార్యాలయంలో సదస్సుకు సంబంధించిన పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డా. భార్గవవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ నంద్యాలలో రాష్ట్రస్థాయి సదస్సు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నామన్నారు. రెం డు తెలుగు రాష్ట్రాలు, దేశంలోని వివిధ నగరాలనుంచి 25మంది ప్రముఖ యూరాలజీ నిపుణులు పాల్గొంటారన్నారు. యురాలజీ విభాగం పీజీ విద్యార్థులు పరిశోధనాపత్రాలు సమర్పిస్తారన్నారు. దక్షిణభారత యూరాలజీ వైద్యుల సంఘం కార్యదర్శి డా.చంద్ర మోహన్, ఉస్మానియా ఆస్పత్రి విశ్రాంత సూపరింటెండెంట్, తెలుగు రాష్ట్రాల్లో యూరాలజీ విభాగ ఆద్యులు డా.విక్రమసింహారెడ్డి, డా.రవికృష్ణ అతిథులుగా పాల్గొంటారన్నారు. డా.దాసరి రమేష్, డా.శ్రీకాంత్‌రెడ్డి, కోశాధికారి డా..జైబాబురెడ్డి పాల్గొన్నారు.

షోలాపూర్ నుంచి ప్రత్యేక రైళ్లు

ఆదోని టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): షోలాపూర్ నుండి అనకాపల్లి వరకు రైలు ప్రయాణికుల రద్దీని తగ్గించడానికి దక్షిణ మధ్య రైల్వే వారు ఈనెలాఖరు నుంచి ప్రతి శుక్రవారం రైలు నెంబర్ 01477ను ప్రతి శనివారం రైలు నెంబర్ 01478 అనకాపల్లి నుండి షోలాపూర్ వరకు నడపనున్నారు. జిల్లాలో మంత్రాలయం రోడ్, ఆదోని మీదుగా ఈ రైళ్లు నడుస్తాయి.

భర్తకు జీవిత ఖైదు

కర్నూలు లీగల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదుతో పాటు రూ.10వేలు జరిమానా విధిస్తూ కర్నూలు మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్టు శుక్రవారం తీర్పు చెప్పింది. శ్రీనివాసులు 2007లో లక్ష్మీదేవిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. తర్వాత భార్యపై అనుమానంతో తరచూ గొడవలు పడేవాడు. 2018లో ఆమెను హత్య చేశాడు. కోర్టులో నిందితునిపై నేరం రుజువు కావడంతో జీవిత ఖైదుతో పాటు రూ.10వేలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది.


ముద్దాయి శ్రీనివాసులు

బాధిత కుటుంబాలకు పరిహారం


చెక్కును అందజేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురుసార్వభౌమ సంస్కృత పాఠశాల విద్యార్థుల్లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నలుగురి కుటుంబాలకు శుక్రవారం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రూ.20 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. ఈఏడాది జనవరి 21న రాత్రి కర్ణాటకలోని సింధనూరు సమీపంలో తుఫాన్ వాహనం బోల్తాపడి డ్రైవర్ శివ(20)తో పాటు నలుగురు వేద విద్యార్థులు సుజయీంద్ర(22), హయవదన(19) అభిలాష(20), జయసింహ(19) మృతి చెందిన విషయం తెలిసిందే. మంత్రాలయం నుంచి మధ్వాచార్యుల ప్రథమ శిష్యులైన నరహరి తీర్థుల ఉత్తరారాధన కోసం హంపి సమీపంలో నవబృందావనానికి వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో ఈ నలుగురు వేద విద్యార్థులు మృతి చెందారు. వారి తల్లిదండ్రులకు రూ.5లక్షల ప్రకారం చెక్కులను పీఠాధిపతి అందజేశారు. ఈ కార్యక్రమంలో పండిత కేసరి, విద్వాన్ రాజాఎస్ గిరిరాజాచార్, రాజాఎస్ అప్రమేయాచార్, ఏఏవో మాధవశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

మఠానికి రూ.3.25లక్షల విరాళం

రాఘవేంద్రస్వామి మఠానికి బెంగళూరుకు చెందిన సుస్మిత అనే భక్తురాలు రూ.1.25లక్షలు, హైదరాబాద్‌కు చెందిన రాఘవేంద్ర సందీప్ అనే భక్తుడు రూ.2లక్షలు విరాళం ఇచ్చినట్లు మఠం ఏఏవో మాధవ శెట్టి, మేనేజరు ఎస్‌కే శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం వేర్వేరు సమయాల్లో కుటుంబ సమేతంగా రాఘవేంద్రస్వామిని దర్శించుకున్నారు. రూ.3.25 లక్షలు విరాళం ఇచ్చిన దాతల కుటుంబాలకు పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు రాఘవేంద్రస్వామి జ్ఞాపిక, శేషవస్త్రం, ఫల, పుష్ప, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. అనంత పురాణిక్, నరసింహా దేశాయ్, శ్రీపాదాచార్ పాల్గొన్నారు.

దాడి కేసులో ఇరువురిపై కేసు

కొలిమిగుండ్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తపై దాడి చేసిన కేసులో ఇరువురిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు సీఐ మద్దినేని రమేష్‌బాబు తెలిపారు. వివరాలు.. కోటపాడు గ్రామానికి చెందిన వెంకటరాముడు, అతని భార్య భూలక్ష్మీపై ఇదే గ్రామానికి చెందిన రాచకుంట చంద్రబాబు, ఎర్రన్న అనే వ్యక్తులు దాడి చేశారు. బాధితుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

దుకాణదారులకు పరిహారం పంపిణీ



చెక్కు అందజేస్తున్న కమిషనర్ విశ్వనాథ్

కర్నూలు న్యూసిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని మెడికల్ కాలేజీ వద్ద రహదారి విస్తరణకు స్వచ్ఛందంగా దుకాణాలను తొలగింకున్న వ్యాపారులను కమిషనర్ విశ్వనాథ్ అభినందించారు. హైకోర్టు ఆదేశాల మేరకు శుక్రవారం క్యాంపు కార్యాలయంలో చెక్కులను అందజేశారు. దశాబ్ద కాలంగా పెండింగ్ ఉన్న సమస్య పరిష్కారానికి మంత్రి టీజీ భరత్ చొరవ తీసుకున్నారన్నారు. మొత్తం ఎడు దుకాణాలకు గాను రూ.27,11,994 విలువైన చెక్కులు అందజేశామన్నారు. డిప్యూటీ సీటీ ప్లానర్ బి.వెంకరటమణ, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ అంజాద్‌బాషా, బిల్డింగ్ కన్‌స్ట్రక్టర్ దివాకర్, అకౌంట్స్ ఆఫీసర్ చుండీ ప్రసాద్, రాష్ట్ర హజ్ కమిటి సభ్యులు మన్సూర్ ఆలీఖాన్, కార్పొరేటర్ జుబేర్, ముత్తవలి ఆజాం, అబ్బాస్, హమీద్, రజాక్, మహబూబ్ పీర్, మునావర్ పాల్గొన్నారు.

బాధితులకు టీడీపీ అండ

ఓర్వకల్లు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బాధితులకు టీడీపీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. మండలంలోని హుశేనాపురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త బోయ హనుమన్న మృతి చెందడంతో కుమారులు అంజనేయులు, హరిబాబుకు రూ.5లక్ష బీమా చెక్కును అందజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు కాటినేని నారాయణ, చైర్మన్, మాజీ చైర్మన్ సుధాకర్, గొల్ల నాగరాజు, మహబూబ్ బాషా, గువ్వ రవికుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

ఆలయ అభివృద్ధికి సహకరించండి

ఆలయాల అభివృద్ధికి దాతలు సహకరించాలని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. శుక్రవారం శకునాల గ్రామంలో యోగా గురువు ఉస్తేపల్లి పుల్లయ్య సహకారంతో కాశీ విశ్వేశ్వర కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులు ప్రారంభించారు. మౌళీశ్వరరెడ్డి, గోవిందరెడ్డి, సుధాకర్‌రావు, మోహన్‌రెడ్డి, బ్రాహ్మణ పల్లె నాగిరెడ్డి, కమ్మ రాజశేఖర్ పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం చూపారాదని నగర పాలక మేనేజర్ చిన్నరాముడు అన్నారు. శుక్రవారం కుమ్మరిగేరి 9,10,11 సచివాలయాలను తనిఖీ చేశారు. సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. హాజరు, మూమెంట్ రిజిస్టర్, రికార్డులను పరిశీలించారు. సమయపాలన పాటించని ఉద్యోగులపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.



రికార్డులను పరిశీలిస్తున్న మేనేజర్

రాష్ట్రస్థాయి పోటీలకు నన్నూరు విద్యార్థులు



క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఓర్వకల్లు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలు అవుట్‌డోర్ స్టేడియంలో నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన, పదో తరగతి విద్యార్థులు, మైఖేల్, జాన్సన్‌లు అండర్-14 కబడ్డీ పోటీలకు, 9వ తరగతి విద్యార్థులు నజీర్ (అండర్-14), వారధి నాయుడు అండర్-14 విభాగంలో గణేష్ ఎంపికయ్యారని హెచ్‌ఎం నిర్మల వసంత కుమారి అన్నారు. గ్రామ పెద్దలు, విశ్వేశ్వరరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు కృషి చేసిన పీడీలు రాజీవ్‌కుమార్ ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీవో రాముడు

కోడుమూరు రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ తల్లిదండ్రుల కలను సాకారం చేయాలని ఎంపీడీవో రాముడు సూచించారు. శుక్రవారం సాయంత్రం వర్కూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. పాఠాలను ఎప్పటికప్పుడు పునశ్చరణ చేసుకుంటూ ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి మార్కులు సాధించవచ్చన్నారు. ఇటీవల గ్రామానికి చెందిన కూలీదంపతుల కూతురు ఆదర్శ ఎంబీబీఎస్ సీటు సాధించడం హర్షణీయమన్నారు. పంచాయతీ కార్యదర్శి నాగార్జున పాల్గొన్నారు.

సోషలిజమే సరైన మార్గం



పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సోషలిజమే మానవజాతి మనుగడకు సరైన మార్గమని సీపీఎం నాయకులు అన్నారు. అక్టోబర్ విప్లవ 108వ దినోత్సవం సందర్భంగా శుక్రవారం సుందరయ్య కూడలిలో నగర కార్యదర్శి టి.రాముడు అధ్యక్షతన జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ పతాకాన్ని ఆవిష్కరించారు. మొదటిసారి ప్యారిస్‌లో కార్మిక రాజ్యం ఏర్పడినా, సరైన సిద్ధాంతం లేక కొద్దిరోజుల్లోనే కుప్పకూలిందన్నారు.

శిథిలం



గూడూరు తహసీల్దార్ కార్యాలయం శిథిలమైంది. 1987లో భవనాన్ని నిర్మించగా, నాలుగేళ్ళ క్రితం కురిసిన వర్షాలకు భవనం కూలింది. అప్పటి జిల్లా అధికారులు నూతన భవన నిర్మాణానికి రూ.90లక్షలు నిధులు మంజూరు చేశారు. అయినా పనులు చేయకపోడంతో నిధులు వెనక్కి వెళ్ళాయి. పాత రెవెన్యూ భవనంలో నిర్వహిస్తున్నారు. ఆ భవనం కూడా శిథిలావస్థలో ఉంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి, నిధులు మంజూరు చేసి కార్యాలయాన్ని నిర్మించాలని ఉద్యోగులు, ప్రజలు కోరుతున్నారు. - **గూడూరు.**

నిరుపయోగం



డీఈవో కార్యాలయంలో లిఫ్టు పనిచేయడం లేదు. దివ్యాంగులు, వృద్ధుల వినియోగం కోసం లిఫ్టు ఏర్పాటు చేశారు. పనిచేయకపోవడంతో డీఈవో, సమగ్ర శిక్ష కార్యాలయాలకు వచ్చే వారు, ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.
- కర్నూలు ఎడ్యుకేషన్

వందేమాతర గేయానికి 150 ఏళ్లు

- ప్రభుత్వ కార్యాలయాలు, యూనివర్సిటీల్లో వేడుకలు
- కొండారెడ్డి బురుజు వద్ద ఎన్‌సీసీ కేడెట్ల పరేడ్



క్లస్టర్ వర్సిటీలో ఆలపిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



కొండారెడ్డి బురుజు వద్ద ఎన్‌సీసీ కేడెట్ల ఆధ్వర్యంలో..



నగరపాలక సంస్థ కార్యాలయంలో..

కర్నూలు అర్బన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వందే మాతర గేయానికి 150 ఏళ్ల పూర్తయిందని వీసీ ప్రొఫెసర్ ఎస్‌ఎస్‌షా వళీ ఖాన్ అన్నారు. శుక్రవారం డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో జాతీయ గేయాలాపన దినోత్సవాన్ని ఎన్ ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వమించారు. రిజిస్ట్రార్, ప్రొఫెసర్ వి. లోక్‌నాథ్, ఇంచార్జీ ప్రిన్సిపాల్ ఎస్ మహబూబ్ బాషా, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

● ఆర్‌యూలో వీసీ వి.వెంకట బసవరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. రెక్టార్ ఎన్‌టీకే నాయక్, పరీక్షల కంట్రోలర్ డాక్టర్ ఎన్‌వెంకటేశ్వర్లు సుందరానందపుచ్చా, భరత్ కుమార్, శ్రీనివాసులు, పాల్గొన్నారు. క్లస్టర్ వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ జీ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో గేయాన్ని ఆలపించారు.

కొండారెడ్డి బురుజు వద్ద ఎన్‌సీసీ ఆధ్వర్యంలో ..

ఎన్ సీసీ 28వ బెటాలియన్ ఆఫీసర్, లెఫ్టినెంట్ కల్నల్ శశికుమార్ ఆధ్వర్యంలో కొండారెడ్డి బురుజు వద్ద పరేడ్ నిర్వహించారు. 375 మంది ఎన్ సీసీ క్యాడెట్లు, ఎన్ సీసీ ఆఫీసర్లు మహేంద్ర, ఆర్ క్లామిక్ నాయక్, వివిధ ఎన్‌సీసీ ఆఫీసర్లుపాల్గొన్నారు.

వందేమాతరం ఆత్మవిశ్వాస నినాదం

కర్నూలు న్యూసిటీ: వందేమాతరం గీతం ప్రతి భారతీయుడులో ఆత్మవిశ్వాసం నింపుతుందని నగర పాలక అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవి.కృష్ణ అన్నారు. గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం కార్యాలయంలో ఉద్యోగులు వందేమాతరం గేయాన్ని ఆలపించారు. మేనేజర్ చిన్నరాముడు, అకౌంట్స్ ఆఫీసర్ చుండీప్రసాద్, ఆర్‌వో జునైద్, డీఎస్‌ఓ క్రిష్ణమోహన్, సిబ్బంది శ్రీదేవి, శోభారాణి, సరస్వతి, నాగరాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

● జడ్పీ మినీ సమావేశ భవనంలో గేయాన్ని ఆలపించారు. జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, సీఈఓ జి.నాసరరెడ్డి, డిప్యూటి సీఈఓ వెంకటసుబ్బారెడ్డి, జడ్పీటీసీలు, అధికారులు, పాల్గొన్నారు.

సి.బెళగల్: తహసీల్దార్ వెంకటలక్ష్మి ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాల వేశారు. రీసర్వే డీటీ వెంకటే శ్వర్లు, వీఆర్వోలు, టీడీపీ నాయకుడు జగదీశ్వరరెడ్డి, బాలాజివెంకటేశ్, లక్ష్మన్న ఉన్నారు.

ఓర్వకల్లు: మండలంలోని ఓర్వకల్లు, హుశేనాపురం, నన్నూరు, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు తదితర గ్రామాల్లో వందేమాతరం గీయాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆలపించారు.

కర్నూలు ఎడ్యుకేషన్: బి.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అధ్యాపకులు ప్రసన్న కుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.

కల్లూరు: పౌరులకు వందేమాతరం గేయం ఆత్మవిశ్వాసం నింపుతుందని విద్యుత్ ఆపరేషన్ సర్కిల్ ఎస్‌ఈ ఆర్.ప్రదీప్‌కుమార్ అన్నారు. శుక్రవారం విద్యుత్తుభవన్‌లో ఉద్యోగులతో కలిసి గేయాన్ని ఆలపించారు.

కర్నూలు కల్చరల్: వందేమాతరం గీతం ఉత్సవాలను ఏడాది పాటు నిర్వహించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మురారి శంకరప్ప కోరారు. శుక్రవారం రోజావీధిలో జాతీయ జెండా ప్రదర్శన నిర్వహించారు. మహిళా సంఘం సభ్యులు మీసాల సుమలత, శేషమ్మ, నారాయణమ్మ, చిట్టెమ్మ, నాగమద్దమ్మ పాల్గొన్నారు.

కర్నూలు హాస్పిటల్: స్వాతంత్ర సమరానికి వందేమాతరం ప్రేరణ అని ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం వైద్యులు, సిబ్బంది వందేమాతరం గేయాలపన చేశారు. ఆర్‌ఎంవో టీసీహెచ్ వెంకటరమణ, అడ్మినిస్ట్రేషన్ విభాగపు అసోసియేట్ ప్రొఫెసర్ డా.శివబాల, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.కిరణ్ కుమార్ ఎమర్జెన్సీ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.సుబ్రహ్మణ్యం, నర్సింగ్ సూపరింటెండెంట్ ఎస్‌పీ సావిత్రీబాయి పాల్గొన్నారు. వైద్య కళాశాలలో ప్రిన్సిపాల్ డా.కే.చిట్టినరసమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ డా.సింధియా శుభప్రద అనాటమి, బయో కెమిస్ట్రీ హెచ్‌వోడీలు డా.శోభాదేవి, డా.కిరణ్మయి, వైద్య అద్యాపకులు డ.కృష్ణమోహన్, డా.సోమశేఖర్ పాల్గొన్నారు.

స్మార్ట్ సిటీగా కర్నూలు అభివృద్ధి

- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి



పందిపాడులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

కల్లూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కర్నూలు కార్పొరేషన్‌ను స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయనున్నట్లు పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి అన్నారు. శుక్రవారం 28వ వార్డు పందిపాడులో రూ.20లక్షలతో పూర్తిచేసిన డ్రైనేజీని ప్రారంభించారు. అనంతరం రూ.49లక్షలతో చేయనున్న సీసీ డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. గత వైసీపీ ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోలేదని ఆరోపించారు. శేఖర్‌చౌదరి, దేవేంద్రారెడ్డి, శంకర్‌రెడ్డి టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తెలిపారు. క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పంపుతుఆన్నమని వాటిని అధికారులు తక్షణమే పరిష్కరించేలా దృష్టి సారించాలన్నారు.

జీవో143, 32ను రద్దు చేయాలి

కర్నూలు హాస్పిటల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జీవోలు 143, 32ను వెంటనే రద్దు చేయాలని తెలుగునాడు వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.మాధవరాజు, జిల్లా కార్యదర్శి మక్బుల్, సభ్యులతో కలిసి డీఎంహెచ్ డా.భాస్కర్‌కు వినతి పత్రం ఇచ్చారు. జీవోలతో 3,650 పోస్టులు రద్దవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయ ఏఎన్‌ఎం గ్రేడ్-3లకు ఇతర శాఖల యాప్‌లు, సర్వేలు చేయిస్తుండటంతో మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఈ.తాండ్రపాడు పీహెచ్‌సీకి రెగ్యులర్ ఫార్మాసిస్టు ఉండేలా చర్యలు తీసుకోవాలనికోరారు. డీఎంహె చ్‌వో కార్యాలయంలో అవినీతిని అరికట్టాలని కోరారు. డీఎంహెచ్‌వో స్పందిస్తూ కొందని కేవలం కోర్టు కేసుల విషయంలో కార్యాలయానికి రప్పిస్తున్నామని, తాము ఎవరికీ డిప్యూటేషన్ వేయలేదన్నారు.



వినతి పత్రం ఇస్తున్న ఉద్యోగులు

'అన్యమత ప్రచారంపై చర్యలు తీసుకోవాలి'

కర్నూలు కల్చరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడకు చెందిన ఓ వ్యక్తి చేస్తున్న అన్యమత ప్రచారంపై చర్యలు తీసుకోవాలని నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం బళ్లారి చౌరస్తాలోని హనుమాన్ ఆలయంలో సమావేశం నిర్వ హించారు. సంఘం తిరుపతి శాఖ అధ్యక్షుడు భానుప్రకాశ్ మాట్లాడుతూ పల్లెలో ప్రచారం చేస్తూ మతమార్పిడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. హిందువులు మతమార్పిడులను ప్రశ్నించాలని కోరారు. టీవీ రవిచంద్రశర్మ, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఆనందరావు, శ్యామ్‌సుందర్‌రావు తదితరులు ప్రసంగించారు.



మాట్లాడుతున్న సండేల్ చంద్రశేఖర్

వృత్తి నైపుణ్య పోటీ పరీక్షలు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏపీ సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకుల ఆదేశాల మేరకు స్థానిక నన్నూరు అమేలియా బీఎస్సీ నర్సింగ్ కళాశాలలో జిల్లాస్థాయి వృత్తి నైపుణ్య పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు 9 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు పాల్గొన్నారు. 10 విభాగాలకు సంబంధించి 74 పాఠశాలకు గాను 676 మంది విద్యార్థులు, 155 వృత్తి శిక్షకులు పాల్గొన్నారు. జిల్లా స్థాయి పోటీల విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి, ఏపీ సమగ్ర శిక్ష అదనపు సమన్వయకర్త శామ్యూల్ పాల్ తెలిపారు. జీసీడీవో ఎం.స్నేహలత పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో సిజిరేయన్లు ప్రారంభం

కోడుమూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో సిజేరియన్ ఆపరేషన్లు ప్రారంభించి నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ నాగరాజు అన్నారు. గర్భిణుల కోసం గైనకాలజిస్టు డాక్టర్ సాగరిక అందుబాటులో ఉంటారని, మండలంలోని అనుగొండ గ్రామానికి చెందిన అలిమాబీ మూడో కాన్పు నిమిత్తం ఉదయం ఆసుపత్రికి రాగా, సిజేరియన్ చేశార న్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

కల్లూరు, నవంబరు 7 (ఆంధ్ర జ్యోతి): పట్టణ పరిధిలో రెండో శని వారం విద్యుత్ మరమ్మత్తు పనుల్లో భాగంగా విద్యుత్ సరఫరాలో అంత రాయం ఉంటుందని కర్నూలు టౌన్ డివిజన్ ఈఈ టి.శేషాద్రి, ఏడీఈ నాగప్రసాద్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి వద్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలన్నారు.

రాయపాటి శ్రీనివాస్‌కు అవార్డు

కర్నూలు కల్చరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ సభ్యుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్‌కు అంతర్జాతీయ 'క్వీన్ విక్టోరియా అవార్డు ఫర్ సర్వీస్ టు హుమానిటీ' అవార్డు అందజేశారు. వివిధ దేశాల్లో సామాజిక సేవ చేసేవారికి ఈ అవార్డు అందజేస్తుంది. యూనివర్శిటీ ఆఫ్ కల్చర్ అండ్ వరల్డ్ పీస్ వీసీ ప్రొఫెసర్ ముస్తఫా, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రాణి అల్‌షేక్ శుక్రవారం అంతర్జాలంలో ఎంపినట్లు రాయపాటి శ్రీనివాస్ తెలిపారు.



రేపు తైక్వాండో పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 9వ తేదీన జిల్లాస్థాయి తైక్వాండో పోటీలు హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు కోచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఎంపికైనవారు 15, 16 తేదీల్లో కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాలకు 9849971256ను సంప్రదించాలన్నారు.

● కర్నూలు ఔట్‌డోర్ స్టేడియంలో ఈ నెల 12న జిల్లాస్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడల ఎంపిక నిర్వహిస్తున్నట్లు డీఎస్‌డీవో భూపతిరావు తెలిపారు.

క్రీడాంశాలు: అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బెస్ట్ ఫిజిక్, బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ, లాన్‌టెన్నిస్, ఖో-ఖో, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, రెజ్లింగ్, యోగాలో పాల్గొనేవారు ఉద్యోగి ఐడీ కార్డు, సీఎఫ్‌ఎంఎస్ ఐడీ నెంబర్, ఆధార్ కార్డు తప్పనిసరియన్నారు.

టీడీపీ గూటికి గొందిపర్ల ఎంపీటీసీ



టీడీపీలో చేరుతున్న ఎంపీటీసీ, వైసీపీ నాయకులు

కర్నూలు రూరల్ నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గొందిపర్ల ఎంపీటీసీ సభ్యురాలు బోయ కృష్ణవేణి, భర్త బోయ గోపాల్ టీడీపీలో చేరు. శుక్రవారం కర్నూలులోని కేడీసీసీబీ చైర్మెన్ విష్ణువర్దన్‌రెడ్డి, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి సమక్షంలో మాజీ డీలర్ రాజారెడ్డితో కలిసి పార్టీలో చేరారు. ఎమ్మెల్యే, కేడీసీసీబీ చైర్మెన్ టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. విష్ణువర్దన్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై స్వచ్చందంగా టీడీపీలో చేరినట్లు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో సాగుతోందన్నారు.

పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించుకోవద్దు

- ఆర్టీవో రవీంద్ర కుమార్



ఆటో డ్రైవర్లకు సూచనలు ఇస్తున్న ఆర్టీవో

ఓర్వకల్లు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆటోల్లో విద్యార్థులను పరిమితికి మించి ఎక్కించుకోవద్దని ఆర్టీవో రవీంద్ర కుమార్ సూచించారు. శుక్రవారం నన్నూరు, ఓర్వకల్లు జాతీయ రహదారిపై పరిమితి మించి ప్రయాణికులతో వెళ్తున్న ఆటోలకు, జరిమాన విధించారు. రాంగ్ రూట్‌లో వెళ్లవద్దని, ఆటోల్లో అధిక శబ్ధాల స్పీకర్లు ఏర్పాటు చేయవద్దన్నారు.

విజేతలుగా రాణించాలి

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలవాలని ఫ్యాక్టరీస్ ఇన్స్‌పెక్టర్ ఆలీమ్ బాషా సూచించారు. ఈ నెల 8 నుంచి 9వ తేదీ వరకు పల్నాడు జిల్లా సత్తెనపల్లి లయోలా కళాశాలలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల సాఫ్ట్‌బాల్ క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేశారు. సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కుబేర నాయుడు, కార్యర్శి అయ్యన్నగౌడ్, కార్యవర్గ సభ్యులు శాంతరాజ్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.



సాఫ్ట్‌బాల్ బాల్ క్రీడాకారులతో అతిథులు

డీఎం నిర్లక్ష వైఖరి వీడాలి

కర్నూలు రూరల్ నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలు-1డిపో మేనేజర్ సుధారాణి కార్మికుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష వైఖరి వీడాలని ఎన్‌ఎంయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌ఆర్ నాయుడు, పీఎండీ ఇస్మాయిల్ డిమాండ్ చేశారు. శుక్రవారం రెండో రోజు డిపో కార్యదర్శి ఇసాక్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. కార్మికుల సమస్యలను పలుమార్లు డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. అనంతరం డిపోమేనేజర్ సుధారాణికి వినతిపత్రం సమర్పించారు. శ్రీనివాసులు, జమ్మన్న, సుజాత, మహేశ్వరి పాల్గొన్నారు.

హాకీ శతాబ్ది పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక అవుట్‌డోర్ స్టేడియంలో శుక్రవారం మాజీ మంత్రి టీజీ వెంకటేశ్ హాజరై హాకీ శతాబ్ది పోటీలు ప్రారంభించారు. ధ్యాన్ చంద్ విగ్రహానికి నివాళి అర్పించారు. యువత క్రీడలు, ఆరోగ్యంపై దృష్టి సారించాలని తెలిపారు. వంద సంవత్సరాల్లో హాకీ క్రీడ ఒలంపిక్‌లో బంగారు పతకాలు, ఏసియా, కప్పుల వలన వన్నె తెచ్చిందన్నారు. క్రీడాకారులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడల్లో చురుగ్గా రాణించాలని రాష్ట్రానికి, జిల్లాకు పేరు తీసుకురావాలని కోరారు. హాకీ కార్యదర్శి దాసరి సుధీర్ మాట్లాడుతూ శతాబ్ది ఉత్సవాల్లో ర్యాలీలు, రక్తధాన శిబిరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఒలింపిక్ సంఘం అద్యక్షుడు బొల్లవరం రామాంజనేయులు మాజీ క్రీడాకారులు పుల్లయ్య, వెంకట్రావు, శాంతి ప్రసాద్‌ను సత్కరించారు. ఈ పోటీల్లో ఆరు బాలుర జట్లు, నాలుగు బాలికల జట్లు పాల్గొన్నాయి. ప్రవీణ్, అరుణ్, రవికుమార్, వీరేష్, మనోహర్, మహేష్, ఖలీల్, భరత్, పెద్దయ్య పాల్గొన్నారు.

చౌడేశ్వరీదేవికి పూజలు

మద్దికెర, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మద్దికెర గ్రామం కొండమ్మ బావి వద్ద వెలసిన చౌడేశ్వరి దేవీ దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఆలయంలో వెలసిన చౌడేశ్వరి దేవీకి ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం మహా మంగళహారతిని ఇచ్చారు. సాయంత్రం ప్రత్యేక పూజలతో పాటు రాత్రి భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పెద్దకోట్ల రమేష్, తదితరులు ఉన్నారు.

'ఇంటి పన్ను వసూళ్లలో జాప్యం వద్దు'

ఆదోని రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఇంటి పన్ను వసూళ్లలో జాప్యం తగదని డివిజనల్ అభివృద్ధి అధికారి బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పెద్దహరివాణం గ్రామ పంచాయతీని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ట్యాక్స్ నాన్ ట్యాక్స్ డేటాను స్వర్ణ గ్రామ పంచాయతీ పోర్టల్‌లో పొందుపర్చాలన్నారు. గ్రామాలు అపరిశుభ్రంగా ఉండకూడదని, నిరంతరం చెత్త సేకరణ, మురికి కాల్వ పూడికతీత చేస్తుండాలన్నారు.

సుజలాం.. సుఫలాం..

- అట్టహాసంగా వందేమాతర గేయం 150 వసంతాల వేడుక
- పాఠశాలలు, కాలేజీలు, ప్రభుత్వ కార్యాలయాల్లో గేయం ఆలాపన
- విద్యార్థుల్లో స్ఫూర్తి నింపిన వక్తలు

వందేమాతర గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు శుక్రవారం ఉదయం 10 గంటలకు ఆదోని, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లోని పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో వందేమాతరం గేయాన్ని ఆలపించారు. జనగణమన జాతీయ గీతంతో సమానమైన హోదాను, గౌరవాన్ని పొందిన వందేమాతర గీతం స్వాతంత్ర్య పోరాట సమయంలో ప్రజలలో జాతీయ భావాన్ని కలిగించిందని వక్తలు పేరొన్నారు.


ఆదోనిలో మున్సిపల్ కార్యాలయంలో


పత్తికొండ టౌన్: పట్టణంలో..


దేవనకొండలో..


మద్దికెరలో..


హొళగుందలో..


తుగ్గలిలో..


ఆస్పరిలో..


ఆదోనిలో..

బీరప్ప గుడి పూజారులకు గౌరవ వేతనం

● కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప


ఏపీ కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప

ఆదోని, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కురువ, కురుమ సమాజానికి సంబంధించిన బీరప్పగుడి పూజారులకు శుభవార్త అని ఏపీ కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. హిందూ ధర్మ పరిరక్షణలో భాగంగా బీరప్ప ఆలయాల్లో పూజారులుగా సేవలు అందిస్తున్న వారికి ఇకపై గౌరవ వేతనంతో పాటు ధూప దీప నైవేద్యం సదుపాయం కల్పించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందన్నారు. మంత్రి సవితమ్మతో పాటు తాను కలిసి ముఖ్యమంత్రి చేసిన విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. బీరప్ప ఆలయాల గుడికట్ట వివరాలను తక్షణమే సేకరించి మూడు రోజుల్లోపు ప్రభుత్వానికి సమర్పించాలని స్పష్టం చేశారు. కురువ బాంధవులకు అత్యవసర విజ్ఞప్తి ప్రభుత్వం యొక్క ఈ చారిత్రాత్మక నిర్ణయం యొక్క ఫలం రాష్ట్రంలోని ప్రతి బీరప్ప గుడి పూజారికి చేరాలంటే కురువ బాంధవుల తక్షణ సహకారం అనివార్యమని అన్నారు. తమ ప్రాంతంలోని బీరప్ప గుడి వివరాలను ఆలస్యం చేయకుండా వెంటనే సంబంధిత జిల్లా దేవదాయశాఖ అధికారులకు తెలియజేయాలని కోరారు. ఈ వివరాలు సకాలంలో ప్రభుత్వానికి చేరితేనే పూజారులకు ఈ సదుపాయం త్వరగా అందుబాటులోకి వస్తుందని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి


వినతులు స్వీకరిస్తున్న టీడీపీ ఆలూరు ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి

ఆలూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి అన్నారు. శుక్రవారం ఆలూరు పట్టణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి ప్రజలు వచ్చి సమస్యలను విన్నవించుకున్నారు. రహదారులు, పాఠశాలలకు ప్రహరీ నిర్మించాలని వినతులు ఇచ్చారు. పెద్దహోతూరు గ్రామ ప్రభుత్వ పాఠశాలలో ఏళ్ల తరబడి స్కావెంజర్‌గా పనిచేస్తున్న తమను విధులకు రావొద్దంటూ అధికారులు ఒత్తిడి చేస్తున్నారని పెద్దరంగమ్మ, హైమావతి, తిక్కమ్మ, సీపీఐ నాయకులు భూపేష్ విన్నవించారు. ప్రతి వినతి పత్రాన్ని పరిశీలించి పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు పంపుతామని ఆమె తెలిపారు. టీడీపీ నాయకులు కటారికొండ సీనప్ప, సాలీసాహెబ్, శ్రీధర్, రామప్ప, మారుతి, ఉచ్చీరప్ప, బొగ్గుల ఈరన్న, కొమ్మురాజు, బీటీ రాజు పాల్గొన్నారు.

సీజనల్ హాస్టల్స్‌తో విద్యా వసతి

తుగ్గలి, నవంబరు 7 (ఆంధ్ర జ్యోతి): బ్రతుకుతెరువు కోసం తల్లిదండ్రులు వలస వెళ్లడంతో వారి పిల్లలు అన్ని సౌకర్యాలతో విద్యనుఅభ్యసించాలని రాష్ట్ర ప్రభుత్వం సీజనల్ హాస్టల్స్ ఏర్పాటు చేసిందని టీడీపీ మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు, ఏపీఎం రాధాకృష్ణ అన్నారు. జీ.ఎర్రగుడి, జొన్నగిరి, పగిడిరాయి, చెన్నంపల్లె, శభాష్‌పురం, రాంపల్లి, పెండేకల్ గ్రామాల్లో సీజనల్ హాస్టళ్లను ఆయా స్థానిక నాయకుల సమక్షంలో ప్రారంభించారు. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు కృషితో తల్లిదండ్రులు వలస వెళ్లిన విద్యార్థులకు చదువు దూరం కాకూడదని, ఈ సీజనల్ హాస్టల్స్ మంజూరు చేయించారని తెలిపారు., వెంకటస్వామి, బాలన్న, మిద్దె రవి కుమార్, ఓబులేసు, మోహన్, శ్రీరాములు, ఓలప్ప పాల్గొన్నారు.

చిన్నారులు చదువుకు దూరం కాకూడదు

హొళగుంద , నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : హొళగుందలోని ఎస్సీ కాలనీలో సీజనల్ హాస్టల్ ప్రారంభించినట్లు ఉషోదయ గ్రామీణ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు చిన్నహ్యాట్ట నాగరాజు శుక్రవారం తెలిపారు. ముఖ్య అతిథులుగా మండల విద్యాఅధికారిణి సుధారాణి, ఖబీర్ సాబ్, ఎస్సై దిలీప్ కుమార్ గురుజాల హాజరైయ్యారు. సీజనల్ హాస్టల్‌ను ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థల ద్వారా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హొళగుంద ఏపీయూడబ్ల్యూజే గౌరవ అధ్యక్షుడు అమీర్‌సాబ్ పాల్గొన్నారు.

'గ్యాస్ ఏజెన్సీపై చర్యలు తీసుకోండి'

వెల్దుర్తి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి):మండలంలో వరుస గ్యాస్ ప్రమాదాలు జరుగుతున్నాయని గ్యాస్ ఏజెన్సీ పై చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి కృష్ణ అన్నారు. శుక్రవారం వెల్దుర్తికి వచ్చిన ఆర్డీవో సందీప్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. మిగతా గ్యాస్ ఏజెన్సీలలో ప్రమాదాలు జరగపోగా ఒక్క ఇండియన్ గ్యాస్ సిలిండర్లు మాత్రమే ప్రమాదాలకు గురవుతున్నాయని అన్నారు. నిబంధనలు ఉల్లంఘించి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని కోరారు. రాజు, అనిల్, శివ లు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

దేవనకొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పోరాటాలతోనే సమస్యల పరిష్కారం సాధ్యమని సీపీఎం జిల్లా నాయకులు వీరశేకర్ అన్నారు. శుక్రవారం తెర్నేకల్ లోని సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ జెండాను వీరశేకర్ ఆయన ఆవిష్కరించారు.

టీడీపీ ఆధ్వర్యంలో ప్రజా దర్బార్


వినతులు స్వీకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు

ఆదోని, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆదోని టీడీపీ ఆధ్వర్యంలో ఘనంగా ప్రజాదర్బార్‌ను మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు అధ్యక్షతన నిర్వహించారు. ప్రజా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి అద్భుత స్పందన లభించింది. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు తమ గ్రామాలు, వార్డుల సమస్యలను నేరుగా మీనాక్షినాయుడు దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా రెవెన్యూ శాఖకు సంబంధించిన ఆర్ఓఆర్, అడంగల్, రీ సర్వే మరియు ఇంటి పట్టాలపై ఎక్కువ సంఖ్యలో అర్జీలు అందినట్లు మీనాక్షినాయుడు తెలిపారు.సమస్యల పరిష్కారం కోసం ఇకపై ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు ప్రజాదర్బార్ నిర్వహిస్తామని మీనాక్షినాయుడు ప్రకటించారు. టీడీపీ సీనియర్ నాయకులు ఉమాపతినాయుడు, ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, ఏపీ బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, బసాపురం రామస్వామి, యువ నాయకులు సిద్ధార్థనాయుడు, వెంకటేష్‌చౌదరి, వీరేష్, మల్లికార్జున పాల్గొన్నారు.

ప్రజలకు వరం పోస్టల్ బీమా

దేవనకొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామీణా ప్రాంతాల ప్రజలకు పోస్టల్ బీమా వరంలాంటిదని ఆర్‌పీఎల్ఐ ఎఫ్‌వో హరికృష్ణ, యంవో వెంకటేష్‌నాయక్ అన్నారు. దేవనకొండలో పోస్టల్ బీమా గురించి ప్రజలకు, దుకాణాదారులకు వివరించారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే పోస్టల్ బీమా చేసుకుంటే కుటుంబానికి భరోసా ఉంటుందన్నారు. గ్రామీణా ప్రాంతాలలో మాత్రామే పోస్టల్ బీమా సదుపాయం ఉంటుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్‌పీఎం భరత్, బీపీఎంలు మల్లికార్జున, నాగరాజు, షేక్షావలి, రాజారెడ్డి, తదితరులు ఉన్నారు.

భక్త కనకదాసు జయంతి వేడుకలు

ఆలూరు రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కురువల ఆరాధ్య దైవం । భక్త కనకదాసు 538వ జయంతి వేడుకల్లో భాగంగా కమ్మరచేడు గ్రామంలో శుక్రవారం కురువ సంఘం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. భక్త కనకదాసు స్వామివారికి గంగపూజ, పంచామృతాభిషేకం, మహామంగళహారతి వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భీరప్పడోలులతో కనకదాసు చిత్రపటాన్ని కమ్మరచేడు గ్రామ పురవీధులగుండా ఊరేగింపు చేపట్టారు. కురువ సంఘం నాయకులు, మాజీ సర్పంచ్ దేవేంద్రప్ప, గడిగే కురువ భీరప్ప, ఎల్ఐసీ నాగేంద్ర, మాస్టర్ గోపాల్, బసవరాజు, దేవేంద్ర, యం.కుమార్, మల్లేష్, శివరామ్, పరశురామ్ పాల్గొన్నారు.

ఆర్డీవో ఆకస్మిక తనిఖీ

వెల్దుర్తి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి తహసీల్దార్ కార్యాలయాన్ని కర్నూలు ఆర్డీవో సందీప్‌కుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సంపూర్ణ ఇండేన్ గ్యాస్ ఏజేన్సీ గోడౌన్‌ను తనిఖీ చేశారు. మండలంలో వరుస గ్యాస్ ప్రమాదాలు జరుగుతున్నాయని, గ్యాస్ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన వారికి నోటీసులు జారీచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మ, ఆర్ఐ మంజుల, వీఆర్వో పద్మావతి, సిబ్బంది ఉన్నారు.

పాఠశాలలో బండరాళ్ల తొలగింపు

పత్తికొండ టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దూదెకొండ గ్రామ పాఠశాల ఆవరణంలో ఉన్న పెద్దబండరాళ్లను స్థానిక ఎమ్మెల్యే కె.ఈ.శ్యామ్‌కుమార్ చొరవతో ఇటాచీ ద్వారా తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గత ఆగస్టు నెల 1వ తేదీన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే ఆర్డీఓ వచ్చిన సందర్భంగా స్కూల్ ఆవరణలో పెద్దబండరాళ్లు ఉన్నందున వాటిని తొలగించాలని సీపీఐ నాయకులు విజ్ఞప్తి చేశారు. స్పందించిన స్థానిక ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌కుమార్ ప్రత్యేకంగా ఇటాచీని పంపించి పెద్దపెద్ద బండరాళ్లను తొలగించడం పట్ల గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దూదేకొండ గ్రామ సీపీఐ ఎంపీటీసీ వీరన్న, టీడీపీ నాయకులు మోహన్, పరమేష్, శంకరయ్య, సీపీఐ నాయకులు అంజినయ్య, రాముడు పాల్గొన్నారు.

పరిమితికి మించిన ప్రయాణం వద్దు

ఆదోని, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పరిమితికి మించి ప్రయాణం చేయవద్దని, ఇందుకు సంబంధించిన నియమ, నిబంధనల అమలు కఠినతరం చేశామని డీఎస్పీ హేమలత స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియంలో వాహనాల యజమానులు, పాఠశాలల, కళాశాలల యాజమాన్యాలు మరియు ఆటో డ్రైవర్ల కోసం ట్రాఫిక్ సీఐ మహమ్మద్‌గౌస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా డీఎస్పీ హేమలత హాజరై మాట్లాడారు. ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, అందరూ బాగుండాలి అందులో మనం ఉండాలనే నినాదంతో ముందుకు సాగాలన్నారు. డిప్యూటీ డీఈఓ వెంకటరమణ, సీఐలుశ్రీరామ్, రాజశేఖర్‌రెడ్డి, రామలింగయ్య, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు


కేకును కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి

పత్తికొండ టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి జన్మదిన వేడుకలు శుక్రవారం పత్తికొండలో వైసీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎంపీపీ నారాయణదాస్ ఆధ్వర్యంలో హోసూరు రోడ్డులోని శారదా వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పత్తికొండ ఎంపీపీ నారాయణదాస్, ఆధ్వర్యంలో పత్తికొండ వైసీపీ నాయకులు కర్నూలుకు వెళ్లి మాజీ ఎమ్మెల్యే ।దేవికి గజమాలతో సత్కరించి కేకు కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ నారాయణదాస్ మాట్లాడుతూ ప్రజాసేవలో నిస్వార్థంగా పనిచేస్తూ పార్టీ శ్రేణులకు అండగా నిలుస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికై నిరంతరం పోరాటాలు సాగిస్తూ పత్తికొండ నియోజకవర్గ అభ్యున్నతి కోసం పాటుపడుతున్న మాజీ ఎమ్మెల్యే ।దేవి ఆయురారోగ్యాలతో వర్ధిల్లి, ప్రజాసేవలో ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జూటూరు మాజీ సర్పంచ్ జయచంద్రారెడ్డి, నాయకులు పెద్దహుల్తి నాగరాజుయాదవ్, ఎంపీటీసీ క్రిష్టారెడ్డి, రవికుమార్‌రెడ్డి, నూర్‌బాషా, బనగాని శీను, జిలానీ, తిప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

చేపలు పట్టుకునే అవకాశం కల్పించాలి


అధికారితో మాట్లాడుతున్న మత్స్యకారులు

మద్దికెర, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మద్దికెర గ్రామ పంచాయతీలో గల మద్దమ్మకుంట, బోనాస్ కుంట, యజ్ఞం చెరువులో చేపలు పట్టుకోవడానికి అవకాశం కల్పించాలని మత్స్యకారులు అధికారులను కోరారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో జిల్లా మత్స్యకారుల అభివృద్ధి అధికారి బి.నాగరాజు, పంచాయతీ కార్యదర్శి శివకుమార్‌తో స్థానిక మత్స్యకారులు మాట్లాడుతూ మొత్తం 32 ఎకరాల విస్తీర్ణంలో గల ఆ చెరువు కుంటలో చేపలు వదిలామని, అయితే..సొసైటీ నిబంధనల మేరకు గత ఏడాది రూ.23వేలు చెల్లించామని, ఈ ఏడాది కూడా ఆ మొత్తాన్ని చెల్లించి చేపలు పట్టుకుంటామన్నారు. అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఎటువంటి జీవో రాలేదని, అందువల్ల జీవో వచ్చే వరకు చేపలు పట్టకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు బాస్కర్, సుగ్గులప్ప ఉన్నారు.

పత్తి రైతులను ఆదుకోవాలి

దేవనకొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షులు నాగేంద్రయ్య అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమీపంలో పత్తి రైతుల రాష్ట్రస్థాయి సమ్మేళన కరపత్రాలను విడుదల చేశారు. ఈనెల 18, 19 తేదిలలో ఆదోనిలో రాష్ట్రస్థాయి పత్తిరైతుల సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఖరీప్ సీజన్లో అధిక వర్షాలతో పత్తిపంట రైతులు నష్టపోవడం జరిగిందన్నారు. మండల అధ్యక్షులు కండప్ప, నాగేశ్వరరావు, వీరాంజి, బాస్కర్, తదితరులు ఉన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి: ఎస్ఐ

వెల్దుర్తి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి):మత్తు పదార్థాల జోలికి వెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దని ఎస్ఐ నరేశ్ అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్ వాడినా, సరఫరా చేసినా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. బాగా చదువుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. ట్రైనీ ఎస్ఐ విద్యశ్రీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర కబడ్డీ పోటీలకు ఎంపిక

ఆదోని అగ్రికల్చర్ , నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాల చదువుతున్న 9వ తరగతి విద్యార్థి చరణ్ దేవ్ రాష్ట్ర కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవి తెలిపారు. పాఠశాల ఆవరణంలో రాష్ట్ర కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థి చరణ్‌ను అభినందించారు. ఉపాధ్యాయులు వీరచంద్రయాదవ్, గిడ్డ రెడ్డి, మహేశ్వరి , శ్రీనివాసులు, శ్రీరాములు, చక్రపాణి, బ్రహ్మానంద రెడ్డి, మధుసూదన్ పాల్గొన్నారు.

ఎస్టీయూ పట్టణ నూతన కమిటీ ఎన్నిక

ఆదోని అగ్రికల్చర్ , నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఎస్టీయూ పట్టణ శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం జరిగింది. నూతన కార్యవర్గ ఎన్నిక పరిశీలకులు నాగరాజు సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొని ప్రకటించారు. పట్టణ అధ్యక్షుడిగా ఎస్ భీమరాజు, ప్రధాన కార్యదర్శిగా గంగానాయక్, ఆర్థిక కార్యదర్శిగా మహబూబ్ సుభాన్, జిల్లా కౌన్సిలర్‌లుగా నాగరాజు, రమేష్ నాయుడు, వీరచంద్ర యాదవ్, రాజా సతీష్, కళ్యాణి, జాన్ విక్టర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం 12 వ పీఆర్సీ కమిషన్ నియమించాలని రావాల్సిన ఆర్థిక బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ఇలా.. నడిచేదెలా?

● చినుకుపడితే చిత్తడే.. ● ఇబ్బంది పడుతున్న ప్రజలు


అధ్వానంగా తయారైన రోడ్డు

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పక్క చిత్రాల్లో కనిపిస్తున్న దృశ్యాలు ఎమ్మిగనూరు మండలం సంతెకూడ్లూరు గ్రామంలోనివి. గత ఐదేళ్ల క్రితం కురిసిన వర్షాలకు మండలంలోని ఆయా గ్రామాల్లో వీధులు చిత్తడిగా మారుతున్నాయి. అడుగేసేందుకు వీలు లేకుండా తయారయ్యాయి. దీంతో గ్రామంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. కురిసిన వర్షపునీరు రోడ్లపై నిలుస్తోంది. నీరు నిల్వఉండడంతో దోమలు ప్రబలి రోగాలు ప్రబలుతున్నాయని గ్రామంలోని ప్రజలు పేర్కొంటున్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రతి ఏటా లక్షల్లో నిధులు విడుదల అవుతున్నా ఆ నిధులు ఏమవుతున్నాయోనని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దళిత కాలనీలో అధికారులు సీసీ రోడ్డు నిర్మించి సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.


రోడ్డుపైనే నిలిచిన వర్షపునీరు

వాహనాల వేలం


వాహనాల వేలంలో పాల్గొన్న ఏఈఎస్ రామకృష్ణారెడ్డి, సీఐ రమేష్ రెడ్డి, ఎస్ఐ ఇస్మాయిల్

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడి వాహనాలకు ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం వేలం వేశారు. ఏఈఎస్ రామకృష్ణారెడ్డి, సీఐ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ మొత్తం 9 వాహనాలు ఉండగా అందులో 6 బైక్‌లు, 2 ఆటోలు, 1 జైలో కారు వేలం వేశారు. 8 వాహనాలను వేలంలో కొనుగోలుదారులు దక్కించుకున్నారు. జైలో కారు వేలంలో ఎవరు కొనుగోలు చేయ డానికి ఆసక్తి కనబరచలేదు. దీని ద్వారా ప్రభుత్వానికి రూ. 2,22,400 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ ఇస్మాయిల్ ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టుబడిన మద్యం ధ్వంసం

వివిధ కేసుల్లో పట్టుబడిన అక్రమ మద్యం, నాటు సారాలను ఏఈఎస్ రామకృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో ధ్వంసం చేసినట్లు సీఐ రమేష్ రెడ్డి తెలిపారు. రమేష్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు వివిధ రకాల 45 కేసుల్లో పట్టుబడిన మద్యం 381.51 లీటర్ల అక్రమ మద్యం, 9.1 లీటర్ల బీరు, 2 లీటర్ల నాటు సారాలు ఉన్నాయని తెలిపారు. వాటి మొత్తం విలువ సుమారుగా రూ. 81,416 అని తెలిపారు.

విద్యుత్ కోతలతో అవస్థలు

పెద్దకడుబూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సమయపాలన లేకుండా విద్యుత్ కోతలు విధిస్తుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని సీపీఐ మండల కార్యదర్శి వీరేష్ అన్నారు. శుక్రవారం పెద్దకడుబూరులో ఆయన మాట్లాడుతూ విద్యుత్ కోతల వల్ల పనులు నిలిచిపోతున్నాయన్నారు. విద్యుత్ ఏఈ సుబ్బారెడ్డి స్పందించి మండలంలో విద్యుత్ కోతలు లేకుండా చూడాలని కోరారు.


ఘనంగా గౌరమ్మ పండుగ వేడుకలు


కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

కౌతాళం, నంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం రాత్రి మహిళలు గౌరి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ప్రతి ఏడాది మాదిరిగానే కార్తీక మాసంలో గౌరి నోములు చేసిన తరువాత మహిళలు వారి ఇంటి నుంచి కలశాలతో కార్తీక దీపాలను వెలిగించుకుని చక్కెర హారతులను ప్లేట్లలో ఉంచుకుని గౌరిమాతకు పూజిస్తు దగ్గర లోని శివాలయాలకు పోయి అక్కడ గౌరిమాతకు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

ఎల్లెల్సీ నీరు జీడీపీలోకి మళ్లింపు

● రోజుకు 150 క్యూసెక్కులు



గోనెగండ్ల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర దిగువ కాలువ నుంచి రోజుకు 150 క్యూసెక్కుల ప్రకారం ఇరిగేషన్ అధికారులు గాజులదిన్నె ప్రాజెక్టు లోకి నీటిని మళ్లిస్తున్నారు. గాజులదిన్నె ప్రాజెక్టుకు హెచ్ ఎన్ఎస్ఎస్(హంద్రీనీవా, శ్రీశైలం బ్యాంక్‌వాటర్)నుంచి వచ్చే నీటిని హంద్రీనీవా అధికారులు నిలిపివేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులో నీరు పుష్కలంగా ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రాజెక్టులో 3.8 టీఎంసీ ల నీరు ఉన్నట్లు జీడీపీ అధికారులు తెలిపారు. ఎల్లెల్సీ రైతులకు నీటి అవసరం ఉయిన్నప్పుడు జీడీపీ కి నీటి మళ్లింపును నిలిపివేసి ఎల్లెల్సీ ఆయకట్టు రైతుకు నీటి ని విడుదల చేయనున్నట్లు తెలుస్తుంది.

బెల్టు పెడితే తాటా తీస్తా: ఎస్ఐ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నందవరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే తాటా తీస్తానని ఎస్ఐ హెచ్చరించారు. శుక్రవారం ఆంధ్రజ్యోతి ఊరూరా బెల్ట్‌షాపులు అనే కథనం ప్రచురితం కావడంతో ఎస్ఐ స్పందించారు. శనివారం నుంచి ప్రతి గ్రామంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. మద్యానికి బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఎవరైనా గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే ముగ్గురిపై కేసు నమోదు చేయడమే కాకుండా రిమాండ్‌కు కూడా తరలించామన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిస్తే 9121101150కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఇద్దరు అరెస్టు

మంత్రాలయం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలపల్లిలో దస్తగిరయ్య స్వామి దర్గా వద్ద ఇద్దరు వ్యక్తులు మద్యం రాస్తుండగా పట్టుకున్నట్లు మాధవరం ఎస్ఐ విజయకుమార్ తెలిపారు. శుక్రవారం సీఐ రామాంజులు ఆదేశాల మేరకు గ్రామానికి చెందిన మంగలి రామాంజనేయులు, ఆదోని ఆర్టీసీ కాలనీకి చెందిన కురువ మల్లికార్జున అనే వ్యక్తులు మద్యం రాస్తుండగా అదే విధంగా కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా దాడులుచేసి పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న రూ.11,800 నగదు, 192 కర్ణాటక టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకుని అరెస్టు చేసినట్లు తెలిపారు.

పది రోజుల పాటు రైల్వే గేటు మూసివేత

కౌతాళం, నంబరు 7(ఆంధ్రజ్యోతి): కుప్పగల్ రైల్వే గేటు వద్ద వంతెన పనులు రైల్వే చేపడుతుండడంతో పది రోజుల పాటు గేటును మూసి వేస్తున్నట్లు తహసీల్దార్ రజినీకాంత్ రెడ్డి తెలిపారు. శుక్రవారం తహసీల్దార్ మాట్లాడుతూ తమ వ్యక్తిగత పనులపై ఆదోనికి వెళ్లే వారు బదినేహాల్, జహోన్నర్తి, ఇస్వీ గ్రామం గుండా వెళ్లాలన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు జాబ్ మేళా నిర్వహించారు. స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఆనంద్‌రాజ్ కుమార్ మాట్లాడుతూ ఈ జాబ్ మేళాలో ఫ్లిప్ కార్ట్, ప్రీమియర్ హెల్త్ కేర్, అపోలో, ఎల్ అండ్ టీ ఫైనాన్స్, టాటా ఎలక్ట్రానిక్స్ మొదలగు కంపెనీలు పాల్గొన్నాయి. ఈ జాబ్ మేళాకు 197 మంది నిరుద్యోగులు హాజరు కాగా వీరిలో 91 మంది ఉద్యోగాలకు ఎంపిక అయినట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ 10వేల నుంచి రూ.30వేల వరకు జీతం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీప్రసాద్, కళాశాల సిబ్బంది, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి సాయితేజ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కేజీబీవీలో సీటు ఇప్పిస్తా: ఎమ్మెల్యే బీవీ

● పత్తి పనులకు వెళ్తున్న విద్యార్థిని నివేదితతో మాట్లాడిన ఎమ్మెల్యే

● ఎమ్మిగనూరు కేజీబీవీలో సీటు ఇవ్వాలని డీఈఓకు సూచన


విద్యార్థిని నివేదితతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఎమ్మిగనూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరులో కేజీబీవీలో సీటు ఇప్పిస్తాం.. బాగా చదువుకో వాలి అని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి విద్యార్థిని నివేదితకు సూచించారు. పుస్తకాలు వదిలి.. పత్తిపనులకు విద్యార్థిని అనే శీర్షిక ఆంధ్రజ్యోతి ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే టీడీపీ సోగనూరు టీడీపీ నాయకులు జగదీష్, రాఘవేంద్ర ద్వారా శుక్రవారం విద్యార్థిని నివేదితను, తండ్రి రాముడును తన దగ్గరకు పిలిపించుకొని మాట్లాడారు. నాకు చదువుకోవాలని ఉందని నివేదిత చెప్పడంతో ఎమ్మెల్యే డీఈఓ శ్యామ్యూల్‌పాల్,కేజీబీవీ ఎస్ఓతో ఫోన్‌లో మాట్లాడారు. విద్యార్థిని నివేదితకు ఎమ్మిగనూరు కేజీబీవీలో సీటు ఇవ్వాలని సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యారంగం పట్ల అత్యంత శ్రద్ధ చూపుతున్నారన్నారు. ప్రతివిద్యార్థికి విద్యను అందించటమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. సీటు తప్పకుండా ఇస్తుంది ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తండ్రికి భరోసా ఇచ్చారు. ఇందుకు నివేదిత, తండ్రి రాముడులు సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

దేశ ప్రజలను ఐక్యం చేసిన గేయం వందేమాతరం

ఎమ్మిగనూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): నాటి స్వాతంత్ర్యోద్యమంలో కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు సమస్త జాతిని ఒక్కటి చేసిన గేయం వందేమాతరం అని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అన్నారు. వందేమాతరం గేయానికి 150ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం ఎమ్మెల్యే ఇంటి దగ్గర వందేమాతర గేయాన్ని స్మరిస్తు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ఆలపించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వందేమాతరం గేయాన్ని బంకించంద్ర చటర్జీ రచించారన్నారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో రణన్నినాదంగా ఉపయోగపడిందన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఈ గేయాన్ని జాతీయగేయంగా భారత ప్రభుత్వం ప్రకటించిందన్నారు. 150 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా భావితరాలకు స్ఫూర్తినిచ్చేందుకు ఈ గేయాన్ని ఆలపించామన్నారు.

● సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ : ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని 14మంది బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధినుంచి 14 మందికి మంజూరైన రూ. 8.94లక్షల విలువైన చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు నియోజకవర్గంలో 146మంది బాధితులకు రూ. 1.20కోట్లు ముఖ్యమంత్రి సహాయనిధినుంచి మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లయ్య మాజీ ఎంపీపీ వాల్మీకి శంకరయ్య, నాయకులు తిరుపతయ్య నాయుడు, నాగయ్య, బాష, ముల్లా కలీముల్లా, బుగిడే నాగరాజు, మసీదుపురం రము, తురేగల్ నజీర్, రంగన్న, దావీదు, జగదీష్, రామచేంద్రలు పాల్గొన్నారు.

గోనెగండ్ల: వందేమాతరం జాతీయ గేయం రచించి 150 ఏళ్ల పూర్తయిన సందర్భంగా గోనెగండ్లలోని పోలీస్ స్టేషన్‌లో పోలీసులు జాతీయ గేయాన్ని పోలీస్ సిబ్బంది శుక్రవారం ఆలపించారు. సీఐ విజయభాస్కర్ మాట్లాడుతూ వందేమాతరం గేయం రచించి ఆలపించి 150 ఏళ్ల పూర్తయిన సందర్భంగా దేశం మొత్తం సంబరాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. కార్యక్రమును ఏడాది పాటు దేశంలో జరుపుకుంటారని ఆయన తెలిపారు.

కోసిగి: ప్రతి ఒక్కరూ మన భారతదేశం పట్ల గౌరవం, మన దేశ భక్తి భావాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సీఐ మంజునాథ్, ఎస్ఐ రమేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం కోసిగి పోలీస్ స్టేషన్‌లో వందేమాతరం గేయాన్ని ఆలపించారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐ ఈశ్వరయ్య, హెడ్ కానిస్టేబుల్ నజీర్, కానిస్టేబుళ్లు లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, రాంప్రతాప్, మనోజ్ గౌడ, తదితరులు పాల్గొన్నారు.

నందవరం: స్వాతంత్ర్యోద్యమంలో వందేమాతరం గేయం ప్రజలను చైతన్యవంతులను చేసిందని బీజేపీ నాయకులు గురురాజ్ దేశాయ్ అన్నారు.


ఎమ్మెల్యే ఇంటిదగ్గర వందేమాతరం గేయాన్ని ఆలపిస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి, టీడీపీ నాయకులు


గోనెగండ్లలో జాతీయగీతాన్ని ఆలపిస్తున్న పోలీసులు


కోసిగి పోలీస్‌స్టేషన్ వద్ద...

వందేమాతరం గేయానికి 150ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఆదేశాలమేరకు.. నందవరంలోని జడ్పీఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులతో కలిసి వందేమాతరం గేయాన్ని ఆలపించారు. కార్యక్రమంలో హెచ్ఎం రామకృష్ణ, సీఆర్‌పీ ఉరుకుందు, మాజీ సర్పంచ్ రామన్న గౌడ్, కల్లెలే శివ, డానియోల్, అబ్దుల్, గని, మిన్నల్లా, దుంద వీరేష్‌లు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు టౌన్: వందేమాతరం జాతీయ గేయం సామాన్యులను సమరయోధులుగా మార్చిందని సీ ఐ శ్రీనివాసులు అన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని స్థానిక పాత ఆటో నగర్‌లో ఎమ్మిగనూరు పే ఉడ్ హర్డ్‌వేర్, గ్లాస్ వ్యాపార వెల్ఫేర్‌అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు వీరేష్, ఈశ్వర్ ఆచారి, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

మంత్రాలయం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సాంకేతిక యాజమాన్య పద్ధతులతో రైతులు అధిక దిగుబడి సాధించవచ్చని ఆత్మ ఏడీఏ వెంకటేశ్వర్లు అన్నారు.శుక్రవారం మండలంలోని వి తిమ్మాపురం, వగరూరు గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి గిరా గణేష్ ఆధ్వర్యంలో మిరప, మొక్కజొన్న, వేరుశనగ, పొగాకు పంటలను పరిశీలించి రైతులకు సలహాలు,సూచనలు ఇచ్చారు.అనంతరం రైతులకు అవసరమైన యూరియాను పంపిణీ చేసిన విధ పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. మిరపపంట ఆకుముడుత తగ్గించేందుకు పసుపు, తెలుపు, నీలం రంగు జిగురు అట్టలు వాడటం వల్ల రసంపీల్చే పురుగుల ఉధృతి తగ్గడం వల్ల అధిక దిగుబడి సాధించుకోవచ్చని అన్నారు. అనంతరం పంటల యాజమాన్య కర దీపికను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో వీఏఏ శేఖర్, సుదాకర్, నరసింహులు పాల్గొన్నారు.


తిమ్మాపురంలో మిరపపంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు


కోసిగిలో ఉల్లి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు, రైతులు

కోసిగి: రైతులు తమ పంటల్లో రసం పీల్చు పురుగుల జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సంచాలకులు వెంకటేశ్వర్లు, బనవాసి కృషి కేంద్రం సమన్వయకర్త రాఘవేంద్ర చౌదరి అన్నారు. శుక్రవారం మండల వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ ఆధ్వర్యంలో కోసిగిలో రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఉల్లి పంటను రైతులు ఏర్పాటు చేసిన తేనేటీగల అట్టలను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ రైతులు సీపీ వీరన్న, కోసిగయ్య, నర్సారెడ్డి, అయ్యన్న, రూతమ్మ తదితర గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కూలీల వలస బాట

● తెలంగాణ, కర్ణాటకలకు పయనం


గుంటూరుకు వెళ్తున్న ప్రజలు

గోనెగండ్ల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలం నుంచి కొన్ని రోజులుగా కూలీలు వలసబాట పడుతున్నారు. శుక్రవారం గంజహళ్లి గ్రామం నుంచి 40 కుటుంబాలు తెలంగాణలోని చేవెళ్లకు పత్తి తీసే పనులకు గాను వాహనాల్లో బయలుదేరారు. మూడు, నాలుగు రోజులుగా మండలం నుంచి వలసబండ్ల వరస పట్టాయి. ఎస్సీ, బీసీ కాలనీ నుంచి తెలంగాణ, రాజంపేట, గుంటూరు, కర్ణాటకలోని మటమద్రి, రాయచూరు, గ్రా మంకు వలసలు వెళ్లారు. కేజీ పత్తి తీస్తే రూ.15 ఇస్తున్నారని, అందుకు ఒప్పందం చేసుకొని వెళ్తున్నట్లు కూలీలు తెలిపారు. గంజహళ్లి జడ్పీహెచ్ ఉరుసుకు ఊరికి వస్తామని కొందరు చెప్పగా, క్రిస్మస్ పండుగకు వస్తామని మరికొందరు పేర్కొన్నారు. ఇక్కడ పనులు లేక బతుకుదెరువు కోసం వలసబాట పడుతున్నామని, ప్రభుత్వం స్పందించి ఇక్కడే పనులు కల్పించాలని వలసపోయిన కూలీలు కోరుతున్నారు.

ధర్నాను జయప్రదం చేయండి


పెద్దకడబూరులో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

పెద్దకడబూరు,నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు 9,10న జరిగే మహా ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం నాయకులు తిక్కన్న, శ్రీనివాసులు, దేవదాను పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయా గ్రామాల్లో ఆటో జాతా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ మంత్రాలయం, పెద్దకడుబూరు మండలాలకు సాగుతాగునీరు అందించాలన్నారు. అలాగే విద్య, రోడ్డు, వైద్యం ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. మండలంలోని వలసలను నివారించి, 200 రోజులు పనిదినాలు కల్పించాలన్నారు.

ఘనంగా సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ఠ


రచ్చుమర్రి మోడల్‌స్కూల్లో సరస్వతీదేవి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఈవో, ప్రిన్సిపాల్, విద్యార్థుల తల్లిదండ్రులు

మంత్రాలయం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని రచ్చుమర్రి మోడల్ పాఠశాలలో ప్రిన్సిపాల్ అశోక్‌నాయక్ ఆధ్వర్యంలో సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. శుక్రవారం చెట్నహళ్లి గ్రామానికి చెందిన విద్యార్థిని అంజలి తండ్రి ఉరుకుందు సరస్వతీదేవి విగ్రహాన్ని విరాళంగా ఇచ్చారు. విరాళం ఇచ్చిన ఉరుకుందు దంపతులను ఎంఈవో మైనుద్దీన్, ప్రిన్సిపాల్ అశోక్‌నాయక్, హెచ్ఎం రామ్మోహన్‌లు శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాదు, నళిని, సోమలింగం, చెన్నకేశవులు, సద్గురుడు, మంజునాథ్, వలీఫ్‌వలి, మునీర్,బంగారప్ప, వైష్ణవి, భాగ్యలక్ష్మి, సోఫియా, ఉరుకుందప్ప పాల్గొన్నారు.

ఆధునిక టెక్నాలజీతో సిగ్నల్స్ ఏర్పాటు


రాఘవేంద్ర సర్కిల్లో సిగ్నల్ ఏర్పాటును పరిశీలిస్తున్న సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్

మంత్రాలయం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో ట్రాఫిక్ సమస్య తీరనుంది. రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో బెంగుళూరుకు చెందిన నీత సొల్యూషన్స్ కంపెనీ వారు రూ.30 లక్షల ఖర్చుతో రాఘవేంద్ర సర్కిల్‌లో ఆధునిక టెక్నాలజీతో సిగ్నల్స్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. శుక్రవారం మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్, నీత సొల్యూషన్స్ ప్రతినిధి భాస్కర్‌లు రాఘవేంద్ర సర్కిల్ నాలుగు రోడ్ల ప్రదేశాన్ని పరిశీలించారు. మరో వారం రోజుల్లో కంపెనీ ప్రతినిధులు పర్యటించి తుంగభద్ర ఆరుగురి పొలం నుంచి ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేస్తారని తెలిపారు. ఈసిగ్నల్ ఆధారంగా రాఘవేంద్ర నాలుగు రోడ్ల కూడలిలో ట్రాఫిక్ ఆంక్షలు అతిక్రమించిన ఆన్‌లైన్‌లోనే వాహన యజమాని, స్థానిక పోలీసులకు జరిమానా మెసేజ్ వెళ్లే విధంగా టెక్నాలజీ రూపొందిస్తున్నట్లు తెలిపారు.

విలువిద్య పోటీలకు తేజస్విని ఎంపిక


తేజస్వినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, పాఠశాల కమిటీ చైర్మన్

కోసిగి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని మోడల్ స్కూల్లో 6వ తరగతి చదువుతున్న విజేతస్విని రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సుందర్ కుమార్, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ లక్ష్మినారాయణ తెలిపారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థిని తేజస్వినిని అభినందించారు. గత నెల 24న తేదీ కర్నూలు జిల్లా స్థాయి పోటీలలో పాల్గొని విలువిద్య పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీలకు ఎంపికైందన్నారు. 30న కర్నూలు జిల్లా తరఫున రాష్ట్రస్థాయిలో పాల్గొనడం జరుగుతుందన్నారు. పెద్దకడుబూరు మండలం గవిగట్టు గ్రామానికి చెందిన వడ్డె బంగారయ్య, పార్వతి దంపతుల కుమార్తె తేజస్విని చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తుందని ఉపాధ్యాయులు అభినందించారు.

రైతులకు సాగునీరు ఇవ్వాలి


మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు వెంకటేశ్వర్లు

కోసిగి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కౌతాళం, పెద్దకడుబూరు, కోసిగి, మంత్రాలయం మండలాల రైతులకు సాగు, త్రాగునీరు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. 9, 10 తేదీలలో పెద్దకడుబూరు నుంచి ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం కోసిగిలోని ఆర్టీసీ బస్టాండులో సీపీఎం మండల కన్వీనర్ రాముడు ఆధ్వర్యంలో ఆటోజాతాను ప్రారంభించారు. మండలంలోని డి.బెళగల్, చిన్నభూంపల్లి, పెద్దభూంపల్లి, బరంగల్, జంపాపురం, తదితర గ్రామాల్లో ఆటో జాతా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగేంద్ర, రాముడు, దిన్నన్న, వీరేష్ పాల్గొన్నారు.

జుమాలదిన్నె జ్వరాలు


మెడికల్ క్యాంపులో రోగుల వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

కోసిగి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జుమాలదిన్నె గ్రామంలో ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నారు. ప్రతి ఇంట్లో ఒకరు, ఇద్దరికి విషజ్వరాల సోకడంతో ఎమ్మెల్యే బీటీ నాయుడు స్పందించారు. బీటీ నాయుడు డిప్యూటీ డీఎంహెచ్ఓ దారామురారెడ్డితో మాట్లాడి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మెడికల్ ఆఫీసర్ డా.ఇబ్రహీం, రాజకిరణ్ రక్తనమూనాలు సేకరించారు. ప్రజలకు మందులు పంపిణీ చేశారు. తహసీల్దార్ వేణుగోపాల్, డిప్యూటీ ఎంపీడీఓ ఈశ్వరయ్యస్వామి బ్లీచింగ్ పౌడర్ చల్లించి స్ప్రే చేయించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తిమ్మరాజు, ఆశా కాలు అధికారులు పాల్గొన్నారు.